# మున్సిపల్ సమరానికి కాంగ్రెస్ సన్నద్ధం

- మున్సిపల్ ఎన్నికలపై టీపీసీసీ ఎన్నికల కమిటీ సుదీర్ఘ చర్చ
- జూమ్ వేదికగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, ఇతర కీలక నేతలు
- బీ-ఫామ్స్ కేటాయింపులో స్క్రీనింగ్ కమిటీదే తుది నిర్ణయం
- అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట
- ఏకగ్రీవ తీర్మానం ద్వారా కమిటీ జాబితాకు ఆమోదముద్ర
- క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపైనే అధిష్టానం ప్రధాన దృష్టి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి ప్రచారం వరకు ఎక్కడా పొరపాట్లకు తావివ్వకూడదని భావిస్తున్న టీపీసీసీ, తాజాగా ఎన్నికల కమిటీ సమావేశాన్ని నిర్వహించింది.

మిగతా 3లో..




# విశాల భారతి

తెలుగు దినపత్రిక

3-02-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 32


# రేవంత్ రెడ్డి పాలనపై బీజేపీ 'ఛార్జ్‌షీట్'

## కాంగ్రెస్ వైఫల్యాలపై బీజేపీ ఛార్జ్‌షీట్ విడుదల

- ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని విమర్శ
- మున్సిపాలిటీల్లో రూ. 250 కోట్ల టాక్సీ కుంభకోణం ఆరోపణ
- రాష్ట్రంలో పెరిగిన నేరాలు, డ్రగ్స్ సంస్కృతిపై ఆందోళన
- 'సేవ్ తెలంగాణ - ఓట్ బీజేపీ' నినాదంతో ప్రజల్లోకి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై భారతీయ జనతా పార్టీ పోరాట పంథాను ఉధృతం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని యంత్రాంగం ప్రజలను వంచిస్తోందని ఆరోపిస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సోమవారం నిప్పులు చెరిగారు. హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో 'బూటకపు హామీలు మోసపూరిత వాగ్దానాలు' పేరుతో రూపొందించిన

మిగతా 3లో..





*తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసుల జారీని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు కదిలిన తీరు చూస్తుంటే మళ్లీ ఉద్యమ రోజులు గుర్తొస్తున్నాయని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.*

# ఉద్యమ రోజులు గుర్తుకొచ్చాయి

- హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్
- బొగ్గు కుంభకోణంపై సీబీఐ విచారణకు డిమాండ్
- ట్యాపింగ్ కేసులో అబద్ధాలు తేలిపోతున్నాయని విమర్శ
- రాష్ట్రంలో క్షీణిస్తున్న శాంతిభద్రతలపై ఆందోళన
- బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా కేటాయింపులపై ఆగ్రహం

03

# తెలంగాణను దోచుకున్నోళ్లు జాతిపితలా?

## రావి నారాయణ రెడ్డి స్ఫూర్తిని కొనియాడిన సీఎం రేవంత్



- నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీ సాధించిన యోధుడు
- పదవుల కోసం ఆరాటపడే నేతలపై రేవంత్ విమర్శలు
- ఉద్యమకారుల ముసుగులో వేల కోట్ల సంపాదనపై ధ్వజం
- సిట్ విచారణను జాతి అవమానంగా మలచడంపై ఆగ్రహం
- న్యాయం ముందు అందరూ సమానమేనని స్పష్టీకరణ

**హైదరాబాద్‌లోని రావి నారాయణ రెడ్డి ఆడిటోరియం వేదికగా జరిగిన జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం రాజకీయ సెగలు రేపింది. ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు రావి నారాయణ రెడ్డి సేవలను స్మరించుకున్నారు. తనకున్న 500 ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టిన ఆయన త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అటువంటి మహనీయుడి పేరుతో ఏర్పాటు చేసిన పురస్కారాన్ని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అందించడం ఆ పురస్కారానికే గర్వకారణమని సీఎం వ్యాఖ్యానించారు.**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

దేశ రాజకీయ చరిత్రలో రావి నారాయణ రెడ్డిది ఒక ప్రత్యేక అధ్యాయమని రేవంత్ కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పార్లమెంటు ఎన్నికల్లో దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన ఘనత ఆయనకే దక్కుతుందని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, పదవుల కోసం పాకులాడకుండా 60 ఏళ్ల వయసులోనే ప్రత్యక్ష రాజకీయాల నుండి తప్పుకున్న నిస్వార్థ నాయకుడు ఆయనని ప్రశంసించారు. ప్రస్తుత కాలంలో అటువంటి నైతిక విలువలు కనుమరుగవుతున్నాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సందర్భంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబం లక్ష్యంగా రేవంత్ రెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రజా క్షేత్రంలో ఓటమి పాలై ప్రజలు తిరస్కరించినప్పటికీ, పదవుల కోసం కొందరు నాయకులు ఇంకా వెంపర్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ కోసం

మిగతా 3లో..

# సరిహద్దుల సెగ

- నరవణే పుస్తకంపై లోక్‌సభలో దుమారం
- చైనా చొరబాట్లపై రాహుల్ గాంధీ ప్రశ్నలు
- పుస్తక ప్రామాణికతను కోరిన రాజ్‌నాథ్ సింగ్
- కాంగ్రెస్ దేశభక్తిపై తేజస్వీ సూర్య వ్యాఖ్యలు
- నిబంధనల అమలుపై స్పీకర్ ఓం బిర్లా స్పష్టత.
- విపక్షాల ఆందోళనతో సభ మధ్యాహ్నానికి వాయిదా



**విశాలభారతి, జాతీయం:**

భారత పార్లమెంట్ దిగువ సభలో సోమవారం నాడు సరిహద్దు భద్రత, దేశభక్తి అంశాలపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగింది. 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్‌చైనా మధ్య నెలకొన్న ఉద్రిక్తతలకు సంబంధించి మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే రాసిన ఆత్మకథలోని అంశాలను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించడం సభలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతున్న సమయంలో, చైనా సైన్యం భారత భూభాగంలోకి చొరబడిందంటూ ఒక మ్యాగజైన్‌లో వచ్చిన కథనాన్ని రాహుల్ ఉటంకించడంతో వాతావరణం వేడెక్కింది. రాహుల్ గాంధీ ప్రసంగాన్ని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్యలోనే అడ్డుకున్నారు. సదరు పుస్తకం ఇంకా అధికారికంగా ప్రచురితం కాలేదని, అలాంటప్పుడు అందులోని అంశాలను సభలో ఎలా ప్రస్తావిస్తారని ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ పుస్తకం మార్కెట్లోకి వచ్చిందా లేదా అన్న విషయాన్ని రాహుల్ స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రచురణ కాని పుస్తకాలలోని అంశాలకు ప్రామాణికత ఉండదని, అవాస్తవాలను సభలో రికార్డుల్లోకి వెళ్లకుండా చూడాలని కేంద్ర మంత్రులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ ఘాటుగా స్పందిస్తూ, తాను ఈ అంశాన్ని

మిగతా 2లో..

# బుల్లెట్ ట్రైన్‌కు హబ్‌గా హైదరాబాద్

- దేశవ్యాప్తంగా ఏడు కొత్త హై స్పీడ్ రైలు కారిడార్ల ప్రకటన
- హైదరాబాద్ - బెంగళూరు ప్రయాణం ఇక కేవలం రెండు గంటలే
- ముంబై - పుణె మధ్య 48 నిమిషాల్లోనే చేరుకునే వెసులుబాటు
- తెలంగాణ రైల్వే రంగానికి బడ్జెట్‌లో రూ. 5,454 కోట్ల భారీ కేటాయింపు
- 2009-14 నాటి కేటాయింపుల కంటే ఆరు రెట్లు పెరిగిన నిధులు
- రాష్ట్రంలో 100 శాతం రైల్వే విద్యుదీకరణ పూర్తి



**విశాలభారతి, జాతీయం:**

భారతీయ రైల్వే ముఖచిత్రం సమూలంగా మారబోతోంది. దేశవ్యాప్తంగా అత్యంత వేగవంతమైన ప్రయాణాన్ని చేరువ చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఏడు హై స్పీడ్ రైలు కారిడార్లను ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్‌లో ఈ మెగా ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపడంతో, దక్షిణ భారతదేశంతో పాటు దేశంలోని కీలక నగరాల మధ్య దూరం ఊహించని విధంగా తగ్గనుంది. గంటకు ఏకంగా 350 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించే ఈ బుల్లెట్ తరహా రైళ్లు, రవాణా రంగంలో సరికొత్త విప్లవాన్ని తీసుకురానున్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక పురోభివృద్ధికి ఈ ప్రాజెక్టులు వెన్నెముకగా నిలుస్తాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కొత్త కారిడార్ల ఏర్పాటుతో ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు చేరుకోవాలంటే ప్రస్తుతం పది గంటల సమయం పడుతుండగా, హై స్పీడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే కేవలం

మిగతా 2లో..

## కేసీఆర్ కూడా జాతిపితనే

- హార్వర్డ్‌లో చదువుకున్నా సీఎం రేవంత్ రెడ్డి తీరు మారలేదు
- సీఎం ప్రసంగాలు వింటే హేట్ స్పీచ్ గురించి అర్థమవుతుంది
- కేసీఆర్‌పై అజీర్తి, అక్కసును రేవంత్ మరోసారి వెళ్లగక్కారు
- గాంధీజీ దేశానికి పిత అయితే, తెలంగాణకు కేసీఆర్ జాతిపిత
- ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులతో నిరంకుశ పాలన సాగిస్తున్నారు
- ప్రజాస్వామ్య విలువలపై మాట్లాడే అర్హత సీఎంకు ఏమాత్రం లేదు

02



# గులాబీ గూటిలో 'కవిత' సెగలు



- బీఆర్ఎస్ వైఖరిపై కవిత సంధిస్తున్న పదునైన విమర్శలు
- సస్పెన్షన్ తర్వాత తీవ్రమైన వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు
- కేటీఆర్ టార్గెట్‌గా సాగుతున్న కవిత ప్రత్యక్ష కౌంటర్లు
- ప్రతిదాడికి దిగకుండా మౌన ముద్రలో గులాబీ అధినాయకత్వం
- ఇంటి గుట్టు రట్టవుతుందనే ఆందోళనలో కల్వకుంట్ల కుటుంబం
- ఏపీలో షర్మిల ఎపిసోడ్ పునరావృతమవుతుందనే భయం

02

# గులాబీ గూటిలో 'కవిత' సెగలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు ఒక విలక్షణమైన మలుపు తిరిగింది. నిన్నటి వరకు పార్టీలో కీలక నేతగా, ఉద్యమ గొంతుకగా ఉన్న కవిత, నేడు అదే గులాబీ జెండాపై యుద్ధం ప్రకటిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ వేటు పడకముందు నుంచే ఆమె పార్టీ తీరుపై అసంతృప్తి వెళ్లగక్కుతూ వస్తున్నారు. అయితే సస్పెన్షన్ తర్వాత ఆమె స్వరం మరింత పదునుదేరింది. పార్టీ అగ్ర నాయకత్వాన్ని, ముఖ్యంగా కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఆమె వదులుతున్న బాణాలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. గూఢాచారి, గుంటనక్క వంటి తీవ్ర పదజాలంతో ఆమె చేస్తున్న విమర్శలు కేవలం రాజకీయ వైరుధ్యాలేనా లేక అంతకు మించి ఏమైనా ఉన్నాయా అన్న చర్చ మొదలైంది. కవిత వేస్తున్న ప్రతి అడుగు, చేస్తున్న ప్రతి విమర్శ పార్టీలో ప్రకంపనలు సృష్టించాల్సి ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణుల నుంచి ఆశించిన స్థాయిలో ప్రతిస్పందన రాకపోవడం గమనార్హం. కేటీఆర్ బయటకు వచ్చి ఏ అంశంపై మాట్లాడినా, దానికి కౌంటర్‌గా కవిత సోషల్ మీడియా వేదికగానో లేదా ప్రెస్ మీట్ల ద్వారానో తక్షణమే స్పందిస్తున్నారు. ఆయన చర్యలను తప్పుబడుతూ, లోపాలను ఎత్తిచూపుతూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ క్యాడర్‌ను అయోమయానికి గురిచేస్తున్నాయి. అయినప్పటికీ, పార్టీ అగ్ర నాయకత్వం మాత్రం ఈ విమర్శలను పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తోంది. ఈ మౌనం వెనుక ఉన్న రాజకీయ వ్యూహం ఏమిటనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. బీఆర్ఎస్ అధినాయకత్వం కవితను అసలు ఒక రాజకీయ ప్రత్యర్థిగా పరిగణిస్తుందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో షర్మిల వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా మారిన తీరును బీఆర్ఎస్ నిశితంగా గమనిస్తోంది. అక్కడ జగన్ ప్రభుత్వం పతనానికి షర్మిల విమర్శలు కూడా ఒక కారణమయ్యాయని, ప్రత్యర్థులకు ఆమె ఒక ఆయుధంగా మారారని బీఆర్ఎస్ భావిస్తోంది. అదే పరిస్థితి ఇక్కడ పునరావృతం కాకూడదని కేసీఆర్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. అందుకే ఆమెను తక్కువ చేసి చూపడం ద్వారా ఆమె ప్రభావం ప్రజల్లో పడకుండా చూడాలనేది వారి ఎత్తుగడగా కనిపిస్తోంది. మరోవైపు, కవితపై ప్రతిదాడికి దిగితే అది ఆమెను మరింత రెచ్చగొట్టినట్లు అవుతుందని, ఫలితంగా ఆమె మరింత దూకుడుగా వ్యవహరించే ప్రమాదం ఉందని పార్టీ నేతలు భయపడుతున్నారు. కవితను ఎంతగా విమర్శిస్తే, ఆమె అంతగా మీడియాలో హైలైట్ అవుతారని, అది పార్టీకే నష్టమని వారు భావిస్తున్నారు. అందుకే ఆమె చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇవ్వకుండా, 'లైట్' తీసుకోవడం ద్వారా ఆమెకు రాజకీయ ప్రాధాన్యత తగ్గించాలని గులాబీ బాసులు వ్యూహరచన చేస్తున్నారు. నిశ్శబ్దమే ఆయుధంగా కవిత ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.

పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి, కల్వకుంట్ల కుటుంబంలో కీలక సభ్యురాలిగా ఉన్న కవితకు పార్టీ లోగుట్టులు పూర్తిగా తెలుసు. ఇంటి గుట్టు రట్టయితే అది రాజకీయంగా ఆత్మాహుతి సదృశ్యమేనని కేసీఆర్ కుటుంబానికి తెలుసు. అందుకే ఆమెను విమర్శించే సాహసం ఎవరూ చేయడం లేదు. రాజకీయ విమర్శల కంటే వ్యక్తిగత, కుటుంబ రహస్యాలు బయటకు వస్తే పార్టీ మనుగడకే ప్రమాదమని వారు ఆందోళన చెందుతున్నారు. ఈ బలహీనతే కవితకు బలంగా మారిందని, అందుకే ఆమె ఎక్కడా తగ్గకుండా విమర్శల పరంపరను కొనసాగిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కేటీఆర్ టార్గెట్‌గా కవిత చేస్తున్న విమర్శలు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉన్నాయి. ప్రతి చిన్న విషయంలోనూ ఆయనను అడ్డగించడం, ఆయన మాటలకు విలువ లేకుండా చేయడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటో అందరికీ అర్థమవుతూనే ఉంది. అయినా కేటీఆర్ మౌనంగా ఉండటం వెనుక తండ్రి కేసీఆర్ ఆదేశాలు ఉన్నట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ కవితతో వాగ్వాదానికి దిగి విషయాన్ని పెద్దది చేయవద్దని, అలా చేస్తే అది విపక్షాలకు వరంగా మారుతుందని అధిష్టానం హెచ్చరించినట్లు తెలుస్తోంది.

షర్మిల ఎపిసోడ్ నుంచి బీఆర్ఎస్ ఒక పాఠాన్ని నేర్చుకుంది. కుటుంబ సభ్యులే ప్రత్యర్థులుగా మారినప్పుడు సంయమనం పాటించకపోతే రాజకీయంగా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు గ్రహించారు. కవితను ఒక రాజకీయ శక్తిగా గుర్తించకుండా, ఆమె విమర్శలను పట్టించుకోకుండా వదిలేయడమే మేలని వారు భావిస్తున్నారు. అయితే ఈ నిశ్శబ్దం పార్టీ కార్యకర్తల్లో అసహనాన్ని పెంచుతోంది. తమ నాయకులను విమర్శిస్తున్నా ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు క్షేత్రస్థాయిలో వినిపిస్తున్నాయి. ఇది పార్టీ భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాలి. కవితను కేవలం ఒక తిరుగుబాటు నేతగా చూడాలా లేక ఒక రాజకీయ వ్యూహకర్తగా చూడాలా అన్నది ఇప్పుడు చర్చనీయాంశం. ఆమె చేస్తున్న ప్రతి విమర్శ వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం కనిపిస్తోంది. బీఆర్ఎస్ గ్రాఫ్‌ను దెబ్బతీయడం ద్వారా తన రాజకీయ ఉనికిని చాటుకోవాలని ఆమె చూస్తున్నారు. ప్రత్యర్థి పార్టీలకు ఆమె ఒక వనరుగా మారే అవకాశం కూడా లేకపోలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ఆమెను ఎంతగా విస్మరించాలని చూసినా, ఆమె మాత్రం తన ఉనికిని చాటుకుంటూనే ఉన్నారు. ఈ క్రమంలో ఆమె చేస్తున్న వ్యాఖ్యలు సామాన్య ప్రజల్లోకి వేగంగా వెళ్తున్నాయి. బీఆర్ఎస్ నేతల ఆవేశం ఒకవేళ కట్టలు తెంచుకుంటే, అది పార్టీ పతనానికి పునాది వేస్తుందని అధినాయకత్వం భయపడుతోంది. ఆవేశంలో చేసే వ్యాఖ్యలు కవితకు సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని, అది అల్టిమేట్‌గా పార్టీకే నష్టమని వారు విశ్లేషించుకుంటున్నారు. అందుకే ఆమె ఎన్ని బాణాలు వేసినా, ఎన్ని అస్త్రాలు సంధించినా, మౌనంగా ఉంటూ కాలం గడపడమే శ్రేయస్కరమని వారు నిర్ణయించుకున్నారు. ఈ వ్యూహం ఎంతవరకు పారుతుందనేది కాలమే నిర్ణయించాలి. మొత్తానికి, బీఆర్ఎస్ వర్సెస్ కవిత పోరు ఇప్పుడు ఒక మైండ్ గేమ్‌గా మారింది. ఒకరు ఆరోపణలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరొకరు మౌనంతో సమాధానం ఇస్తున్నారు. ఈ నిశ్శబ్ద యుద్ధంలో గెలుపు ఎవరిదనేది పక్కన పెడితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఇంటి గుట్టు రచ్చకెక్కకుండా చూసుకోవాలనే తాపత్రయం ఒకవైపు, తన అస్తిత్వం కోసం పోరాడుతున్న కవిత మరోవైపు.. ఈ సమీకరణం గులాబీ కోటను ఏ తీరానికి చేరుస్తుందో వేచి చూడాలి.

# సరిహద్దుల సెగ

**మొదటిపేజీ తరువాయి**

లేవనెత్తాలని ముందుగా అనుకోలేదని వివరించారు. అంతకుముందు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన ప్రసంగంలో కాంగ్రెస్ పార్టీ దేశభక్తిని, భారతీయ సంస్కృతిపై తమకున్న అవగాహనను ప్రశ్నించినందువల్లే తాను ఈ విషయాలను బయటపెడుతున్నానని చెప్పారు. దేశభక్తులు ఎవరో, దేశద్రోహులు ఎవరో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని, అందుకే మాజీ సైనిక ప్రధానాధికారి రాసిన అంశాలను చదువుతున్నానని ఆయన పేర్కొన్నారు. మ్యాగజైన్ కథనం ప్రకారం.. డోక్లాం సమీపంలో చైనాకు చెందిన నాలుగు ట్యాంకులు భారత సరిహద్దులను దాటి పర్వత శ్రేణులను ఆక్రమించే ప్రయత్నం చేశాయని రాహుల్ ఉదహరించారు. ఈ వాస్తవాలను వింటే అధికార పార్టీకి ఎందుకు అంత భయం కలుగుతోందని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిజాలను దాచిపెడుతోందని, ఒకవేళ భయం లేకపోతే తనను ఆ కథనాన్ని పూర్తిగా చదవడానికి అనుమతించాలని రాహుల్ సవాల్ విసిరారు. ఈ విషయంలో తమకు అడ్డుతగలడం అంటే దేశ భద్రతపై జరుగుతున్న చర్చను పక్కదారి పట్టించడమేనని ఆయన ఆరోపించారు. ఈ వివాదంలోకి కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ప్రవేశించారు. ఎంపీ తేజస్వీ సూర్య తన ప్రసంగంలో ప్రతిపక్షాల క్యారెక్టర్‌ను గానీ, వారి దేశభక్తిని గానీ కించపరిచేలా మాట్లాడలేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రాజకీయ విమర్శలు చేసినంత మాత్రాన ఇలాంటి సున్నితమైన అంశాలను వక్రీకరించకూడదని హితవు పలికారు. అటు సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ ప్రతిపక్ష నేతకు మద్దతుగా నిలిచి, చైనా సరిహద్దు వివాదం దేశ భద్రతకు సంబంధించినదని, దానిపై చర్చకు అనుమతించాలని కోరారు. సభలో గందరగోళం ముదరడంతో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకున్నారు. సభా నియమ నిబంధనల ప్రకారం చర్చలు జరగాలని ఆయన సభ్యులకు సూచించారు. వార్తాపత్రికల క్లిప్పింగులు లేదా మార్కెట్లో అందుబాటులో లేని పుస్తకాలలోని సమాచారాన్ని సభలో ఉటంకించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సైతం ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. సభా మర్యాదలను ఉల్లంఘించే సభ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా ఆలోచించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నిబంధనల పుస్తకాన్ని ఉటంకిస్తూ, సభకు సంబంధం లేని అంశాలను లేదా ధ్రువీకరించని వార్తలను రికార్డుల్లోకి తీసుకోలేమని స్పీకర్ తేల్చి చెప్పారు. సభ్యులు బాధ్యతాయుతంగా మాట్లాడాలని, సభాపతి ఆదేశాలను గౌరవించాలని ఆయన కోరారు. అయితే విపక్ష సభ్యులు తమ నిరసనను కొనసాగించడంతో సభలో నినాదాలు మిన్నంటాయి. చైనా అంశంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్షాలు పట్టుబట్టడంతో పరిస్థితి అదుపు తప్పింది. ప్రతిపక్ష నేతగా తనకు మాట్లాడే హక్కు ఉందని, రక్షణ మంత్రి తనను అడ్డుకోవడం సరికాదని రాహుల్ వాదించారు. సభలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ప్రభుత్వం ఏదో దాస్తోందనే అనుమానం కలుగుతోందని ఆయన వ్యాఖ్యానించారు. మాజీ ఆర్మీ చీఫ్ స్వయంగా రాసిన విషయాలను కూడా ప్రజలకు తెలియకుండా చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సభలో చర్చ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన గట్టిగా వినిపించారు. చివరికి అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం తీవ్రం కావడంతో స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 4 గంటల వరకు వాయిదా వేశారు.



# బుల్లెట్ ట్రైన్‌కు హబ్‌గా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**



రెండు గంటల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చని రైల్వే మంత్రి వివరించారు. ఇదే క్రమంలో పుణె నుంచి హైదరాబాద్‌కు కేవలం గంటా 55 నిమిషాల్లో ప్రయాణించవచ్చు. అత్యంత బిజీగా ఉండే ముంబైపుణె మార్గంలో ప్రయాణ సమయం గంట కంటే తక్కువగా, అంటే కేవలం 48 నిమిషాలకు పరిమితం కానుంది. ఈ వేగం వల్ల ఉద్యోగులు, వ్యాపారులు, పర్యాటకులకు ఎంతో సమయం ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. చెన్నై, బెంగళూరు నగరాల మధ్య ప్రయాణం కూడా ఇకపై అత్యంత సులభతరం కానుంది. కేవలం ఒక గంట 13 నిమిషాల్లోనే ఈ రెండు మెట్రో నగరాల మధ్య రాకపోకలు సాగించవచ్చు. అలాగే హైదరాబాద్ నుంచి చెన్నైకి రెండు గంటల 55 నిమిషాల్లో చేరుకునేలా ట్రాక్ రూపకల్పన జరుగుతోంది. ఉత్తర భారతంలోనూ ఢిల్లీవారణాసి, వారణాసిసిలిగురి మార్గాల్లో హై స్పీడ్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. వారణాసి నుంచి సిలిగురికి రెండు గంటల 55 నిమిషాల్లో చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కారిడార్ల నిర్మాణం వల్ల కేవలం వేగమే కాకుండా, పర్యావరణ హితమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని రైల్వే శాఖ స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి ఈసారి బడ్జెట్‌లో కేంద్రం విశేషమైన ప్రాధాన్యత నిచ్చింది. 202627 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్రంలో రైల్వే మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రాజెక్టుల కోసం రికార్డు స్థాయిలో రూ. 5,454 కోట్లను కేటాయించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009 నుంచి 2014 మధ్య కాలంలో జరిగిన సగటు వార్షిక వ్యయం కేవలం రూ. 886 కోట్లు మాత్రమే ఉండేది. దానితో పోలిస్తే ప్రస్తుతం సుమారు ఆరు రెట్లు ఎక్కువ నిధులను తెలంగాణ రైల్వే అభివృద్ధి కోసం కేటాయించడం గమనార్హం. ఈ భారీ నిధులు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను వేగవంతం చేయడంతో పాటు కొత్త లైన్ల నిర్మాణానికి ఊతమివ్వనున్నాయి.

ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా రూ. 47,984 కోట్ల విలువైన వివిధ రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. పట్టాల డబ్లింగ్, కొత్త లైన్ల సర్వేలు, స్టేషన్ల ఆధునీకరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే తన రైల్వే నెట్‌వర్క్‌లో 100 శాతం విద్యుదీకరణను పూర్తి చేసుకుంది. దీనివల్ల డీజిల్ వినియోగం తగ్గి, కాలుష్య రహిత ప్రయాణం సాధ్యమవుతోంది. ఇది దక్షిణ మధ్య రైల్వే సాధించిన ఒక అద్భుతమైన మైలురాయిగా రైల్వే మంత్రి కొనియాడారు. విద్యుదీకరణ వల్ల రైళ్ల వేగం పెరగడమే కాకుండా కార్యకలాపాల సామర్థ్యం కూడా మెరుగుపడింది.

రైల్వే స్టేషన్ల రూపురేఖలను మార్చేందుకు ఉద్దేశించిన 'అమృత్ భారత్ స్టేషన్' పథకం తెలంగాణలో విజయవంతంగా అమలవుతోంది. ఈ పథకం కింద రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాలతో పునరాభివృద్ధి చేస్తున్నారు. ఇందుకోసం రూ. 2,015 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఇప్పటికే బేగంపేట, కరీంనగర్, వరంగల్, శ్రీ బాల బ్రహ్మేశ్వర జోగుళాంబ స్టేషన్లలో ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన స్టేషన్లలో కూడా పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే రాష్ట్రంలోని ప్రధాన రైల్వే స్టేషన్లన్నీ విమానాశ్రయాల తరహాలో సర్వాంగ సుందరంగా మారుతాయని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ హై స్పీడ్ కారిడార్ల నిర్మాణం వల్ల కేవలం ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, దక్షిణ భారత రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ఆర్థిక వ్యవస్థలకు భారీ ప్రోత్సాహం లభించనుంది. కొత్త పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పడటానికి, ఉపాధి అవకాశాలు పెరగడానికి ఈ వేగవంతమైన కనెక్టివిటీ తోడ్పడుతుంది. ప్రధాన నగరాల మధ్య అనుసంధానం పెరగడం వల్ల వర్తక వాణిజ్యాలు విస్తరిస్తాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి కూడా ఈ అభివృద్ధి ఫలాలను అందుకోనుంది. రవాణా వ్యయం తగ్గడం వల్ల నిత్యావసరాల ధరలపై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉంది.

రైల్వే భద్రతకు కూడా ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశారు. 'కవచ్' వంటి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని హై స్పీడ్ కారిడార్లలో విరివిగా ఉపయోగించబోతున్నారు. పట్టాల పటిష్టత, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునీకరణపై దృష్టి సారించారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రాజెక్టులలో భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా సాంకేతికతను జోడించి రైల్వే ట్రాక్లను అభివృద్ధి చేస్తున్నారు. దీనివల్ల ప్రయాణీకుల నమ్మకం మరింత పెరగడంతో పాటు సరుకు రవాణాలో కూడా రైల్వే తన వాటాను గణనీయంగా పెంచుకోగలదని అంచనా వేస్తున్నారు.

అమృత్ స్టేషన్లలో భాగంగా డిజిటల్ బోర్డులు, మెరుగైన వెయిటింగ్ హాల్స్, ఎస్కలేటర్లు, లిఫ్టులు, దివ్యాంగులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. స్టేషన్ పరిసరాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తున్నారు. తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాలలో కూడా రైల్వే మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వల్ల గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య దూరం తగ్గుతోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు తెలంగాణను రవాణా హబ్‌గా మార్చడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. మొత్తానికి, కేంద్రం ప్రకటించిన ఈ ఏడు హై స్పీడ్ కారిడార్లు, తెలంగాణకు కేటాయించిన రికార్డు స్థాయి నిధులు భారతీయ రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించనున్నాయి. త్వరలోనే బుల్లెట్ వేగంతో దూసుకెళ్లే రైళ్లలో ప్రయాణించడం భారతీయుల కల కాదని, అది వాస్తవం కాబోతోందని అశ్విని వైష్ణవ్ మాటలు స్పష్టం చేస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనే దేశ పురోభివృద్ధికి ఇంధనమని నమ్ముతున్న కేంద్ర ప్రభుత్వం, ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రాబోయే ఐదేళ్లలో భారతీయ రైల్వే ప్రపంచంలోనే అత్యంత ఆధునికమైన మరియు వేగవంతమైన రవాణా వ్యవస్థలలో ఒకటిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.

# కేసీఆర్ కూడా జాతిపితనే

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ రాజకీయాల్లో విమర్శల పర్వం మరోసారి తారాస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి ఉండాల్సిన సంస్కారం రేవంత్ రెడ్డిలో లోపించిందని ఆయన ఆరోపించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయం వంటి ప్రతిష్ఠాత్మక వేదికలపై చదువుకున్నప్పటికీ, రేవంత్ రెడ్డి తన సహజమైన వ్యక్తిత్వాన్ని మార్చుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. రావి నారాయణరెడ్డి పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు అత్యంత దురదృష్టకరమని, అవి ఆయన హోదాకు తగవని హరీష్ రావు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడే తీరు చూస్తుంటే ద్వేషపూరిత ప్రసంగాల గురించి ప్రత్యేకంగా పుస్తకాలు చదవాల్సిన అవసరం లేదని హరీష్ రావు వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రసంగాలను వింటే హేట్ స్పీచ్ అంటే ఏమిటో అర్థమవుతుందని ఆయన చురకలు అంటించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి కూడా ప్రతిపక్ష నేతలపై వ్యక్తిగత దూషణలకు దిగడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల రేవంత్ రెడ్డి ప్రదర్శిస్తున్న అజీర్తి, అక్కసు ఆయన మాటల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని హరీష్ రావు విమర్శించారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్రను ఎవరూ చెరిపివేయలేరని హరీష్ రావు పునరుద్ఘాటించారు. భారతదేశానికి మహాత్మా గాంధీ ఎలాగైతే జాతిపితగా నిలిచారో, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ కూడా ఈ ప్రాంతానికి జాతిపిత వంటివారని ఆయన అభివర్ణించారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ఆత్మగౌరవం నిలబడిందని, అటువంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని కుతంత్రాలు చేసినా తెలంగాణ ప్రజల హృదయాల నుండి కేసీఆర్‌ను వేరు చేయలేరని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్యంలో విమర్శలు సహజమని, కానీ ప్రస్తుతం అధికారంలో ఉన్న నాయకులు విమర్శలను తట్టుకోలేకపోతున్నారని హరీష్ రావు మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, విధానాలను నిలదీస్తే అక్రమ అరెస్టులు చేయడం, కేసులు నమోదు చేయడం వంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికార మదంతో వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచిన ప్రభుత్వం ప్రజల గొంతు నొక్కడానికి ప్రయత్నించడం హేయమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ల పాలనలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు అణచివేత ధోరణి కనిపిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని హరీష్ రావు సూటిగా ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన వ్యక్తి ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అనైతిక రాజకీయాలకు పాల్పడే రేవంత్ రెడ్డి, నైతికత గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ప్రతిపక్షాలను గౌరవించడం రాని ముఖ్యమంత్రి, రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తున్నానని చెప్పడం పెద్ద అబద్ధమని హరీష్ రావు విమర్శించారు. అధికారం శాశ్వతం కాదని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పునాదులు వేసిన కేసీఆర్ కుటుంబంపై వ్యక్తిగత దాడులు చేయడం రేవంత్ రెడ్డి తన దైనందిన కార్యక్రమంగా మార్చుకున్నారని హరీష్ రావు ఆరోపించారు. రావి నారాయణరెడ్డి వంటి మహనీయుల స్మారక కార్యక్రమాల్లో కూడా రాజకీయం చేయడం సీఎం సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని అన్నారు. అటువంటి పవిత్రమైన వేదికలను రాజకీయ కక్ష సాధింపులకు వాడుకోవడం తగదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఆయన విశ్లేషించారు.

ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి కేసీఆర్‌పై విషం చిమ్ముతున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం, ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇటువంటి విమర్శలు చేస్తోందని ఆరోపించారు. రైతు బంధు, రుణమాఫీ వంటి కీలక అంశాల్లో ప్రభుత్వం చేతులెత్తేసిందని, ఇప్పుడు ప్రజలకు సమాధానం చెప్పలేక ప్రతిపక్ష నేతలపై పడి ఏడుస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఎన్ని అబద్ధాలు చెప్పినా సత్యం ఎప్పుడూ దాగదని, కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి ప్రతి గడపకూ తెలుసని హరీష్ రావు వివరించారు.

పోలీసు వ్యవస్థను రేవంత్ రెడ్డి తన సొంత అవసరాల కోసం వాడుకుంటున్నారని హరీష్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై నిరంతరం నిఘా పెట్టడం, సోషల్ మీడియాలో ప్రశ్నించే వారిని వేధించడం వంటి చర్యలు గర్హనీయమని అన్నారు. ఇది ప్రజాస్వామ్యమా లేక రేవంత్ రెడ్డి రాచరికమా అని ఆయన ప్రశ్నించారు. భావప్రకటన స్వేచ్ఛను హరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నియంతృత్వ పోకడలతో ఎక్కువ కాలం పాలన సాగించలేరని రేవంత్ రెడ్డి గ్రహించాలని హరీష్ రావు సూచించారు.

రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో వాడే భాషపై కూడా హరీష్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తి వీధి రౌడీలా మాట్లాడటం తెలంగాణ గౌరవాన్ని కించపరచడమేనని అన్నారు. హార్వర్డ్ వంటి సంస్థల్లో నేర్చుకున్నది ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. చదువు సంస్కారాన్ని నేర్పాలి కానీ, అహంకారాన్ని కాదని హితవు పలికారు. రేవంత్ రెడ్డి తన ప్రసంగాల్లో సభ్యత, సంస్కారం పాటించాలని, లేదంటే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని హరీష్ రావు స్పష్టం చేశారు.

చివరగా, తెలంగాణ సమాజం రేవంత్ రెడ్డి వైఖరిని నిశితంగా గమనిస్తోందని హరీష్ రావు పేర్కొన్నారు. కేసీఆర్ పై చేస్తున్న వ్యక్తిగత విమర్శలు ఆపాలని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నాం కదా అని అడ్డగోలుగా మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

# విద్యుత్ శాఖ అభివృద్ధిలో మరో కీలక ఘట్టం

- **ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ నూతన భవనం ప్రారంభం**
- **వేగవంతమైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**

**మణుగూరు, విశాలభారతి :**

మండలంలోని గుట్ట మల్లారం పంచాయతీ పరిధిలో రూ.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన భవనాన్ని శుభప్రదంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన విద్యుత్ సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ప్రారంభం కావడం ద్వారా మణుగూరు మండలం తో పాటు పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్యల పరిష్కారం మరింత సులభతరం అవుతుందని అన్నారు. విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, పరిపాలనా పనులు ఇకపై స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. అలాగే పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని, మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వెల్లడించారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రహదారులు, తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాల విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఈ నూతన ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు, విద్యుత్ శాఖ సిబ్బందికి కూడా సౌకర్యవంతమైన పని వాతావరణం ఏర్పడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎలక్ట్రిసిటీ) మహేందర్, డీఈ జీవన్ కుమార్, ఎస్ఏఓ శ్రీధర్, ఏడీఈ ఉమా మహేశ్వర్ రావు, ఏఏఓ సత్యనారాయణ, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు తదితరులు పాల్గొన్నారు.



# రేవంత్ రెడ్డి పాలనపై బీజేపీ 'ఛార్జ్‌షీట్'

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ ఛార్జ్‌షీట్‌ను ఆయన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా, ప్రజలకు ఇచ్చిన ఒక్క వాగ్దానాన్ని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని, కేవలం మాటల గారడీతో కాలం వెళ్లదీస్తోందని ఆయన ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలు కేవలం ఓట్లు దండుకోవడానికే పరిమితమయ్యాయని రాంచందర్ రావు విమర్శించారు. నేడు రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా తయారైందంటే, దేశం కోసం పనిచేసి పదవీ విరమణ పొందిన రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు కూడా సకాలంలో ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమం పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్, క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గాలికొదిలేసిందని మండిపడ్డారు. గ్యారెంటీల అమలులో స్పష్టత లేకపోవడంతో సామాన్య ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆయన ధ్వజమెత్తారు.



విద్యా రంగానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని బీజేపీ చీఫ్ దుయ్యబట్టారు. చారిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి కోసం రూ. 1,000 కోట్లు కేటాయిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన సీఎం, నేటికీ ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని గుర్తు చేశారు. ఉన్నత విద్యను గాలికొదిలేసి కేవలం ప్రచారానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని, నిధుల లేమితో విద్యా సంస్థలు కునారిల్లుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య రంగంలోనూ కాంగ్రెస్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రైవేట్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేదలకు వైద్యం అందడం లేదని చెప్పారు. సర్కారు ఆసుపత్రుల్లో మందుల కొరత వేధిస్తోందని, నిరుపేదల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్య, వైద్య వ్యవస్థలు పూర్తిగా కుంటుపడ్డాయని, ఈ వైఫల్యానికి ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇక గృహ నిర్మాణ రంగంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రభుత్వం పెద్ద డ్రామా ఆడుతోందని రాంచందర్ రావు విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా కొత్తగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించిన దాఖలాలు లేవని, కేవలం పాత ఇళ్లకు రంగులు వేస్తూ ప్రజలను నమ్మిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ఫండ్ కోసం, ఓట్ల కలెక్షన్ల కోసమే ఈ పథకాన్ని వాడుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను దారి మళ్లిస్తూ, తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకోవడం కాంగ్రెస్ నైజమని ఆయన విరుచుకుపడ్డారు. మున్సిపాలిటీల నిర్వహణలో భారీ కుంభకోణాలు చోటు చేసుకుంటున్నాయని బీజేపీ నేత సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా ఏడు మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల నిర్వహణ పేరుతో రూ. 250 కోట్లకు పైగా స్కామ్ జరిగిందని ఆయన వివరించారు. స్థానిక సంస్థలకు వచ్చే నిధులన్నీ కేంద్ర ప్రభుత్వం పంపిస్తున్నవేనని, రాష్ట్ర ప్రభుత్వం పైసా కూడా విదిల్చడం లేదని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలకు కేంద్రం ఇస్తున్న గ్రాంట్లను కూడా జీతాల కోసం మళ్లించడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.

రాష్ట్రంలోని రహదారుల పరిస్థితి అధ్వానంగా తయారైందని, గుంతలమయమైన రోడ్ల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. శాంతిభద్రతల విషయంలో రేవంత్ సర్కార్ పూర్తిగా విఫలమైందని, రాష్ట్రంలో క్రైమ్ రేటు విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ నేడు డ్రగ్స్ మాఫియాకు కేంద్రంగా మారిందని, యువత భవిష్యత్తు అంధకారంలో పడుతోందని ఆయన హెచ్చరించారు. ఆధ్యాత్మిక రంగానికి సంబంధించి కూడా కాంగ్రెస్ వైఖరిపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. దేవాలయాలకు చెందిన వేల ఎకరాల భూములు కబ్జాలకు గురవుతున్నాయని, చివరకు ఆలయ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ధోరణి హిందూ సమాజ మనోభావాలను దెబ్బతీస్తోందని, దేవాలయ ఆస్తులను కాపాడటంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై కూడా రాంచందర్ రావు ఘాటుగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ సంస్కృతిని ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని ఆరోపించారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని, అసలు ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం 40 శాతం కమిషన్ల ప్రభుత్వమని, కేవలం కాంట్రాక్టులు, కమిషన్ల కోసమే పరిపాలన సాగుతోందని విమర్శించారు. తప్పుడు కేసులు పెట్టి విపక్షాలను అణచివేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలు ఆలోచించాలని, గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలకు అవకాశం ఇచ్చి చూశారని రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇస్తే రాష్ట్ర గమనాన్ని మారుస్తామని భరోసా ఇచ్చారు. 'సేవ్ తెలంగాణ ఓట్ బీజేపీ' అనే నినాదంతో గడప గడపకూ వెళ్లి కాంగ్రెస్ అక్రమాలను ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి కేవలం డబుల్ ఇంజిన్ సర్కార్‌తోనే సాధ్యమని రాంచందర్ రావు ఉద్ఘాటించారు.

# మున్సిపల్ సమరానికి కాంగ్రెస్ సన్నద్ధం

**మొదటిపేజీ తరువాయి**

ఈ భేటీలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవడంతో పాటు, పార్టీ కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా అభ్యర్థుల ఎంపికలో నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తూ, ఒక క్రమపద్ధతిలో ముందుకు వెళ్లాలని నాయకత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ జూమ్ మీటింగ్‌లో రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై లోతైన విశ్లేషణ జరిగింది. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రిమండలి సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు ఈ సమావేశంలో భాగస్వాములయ్యారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అధికారంలో ఉన్నందున బాధ్యత మరింత పెరిగిందని ఆయన గుర్తుచేశారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో గ్రూపు రాజకీయాలకు తావులేకుండా ఉండేందుకు 'స్క్రీనింగ్ కమిటీ' ఏర్పాటుపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా బలమైన అభ్యర్థులను గుర్తించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించాలని నిర్ణయించారు. స్థానిక సమీకరణాలు, అభ్యర్థికి ఉన్న ప్రజాధారణ మరియు పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను పరిగణనలోకి తీసుకుని మాత్రమే జాబితాను రూపొందించాలని నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. దీనివల్ల అసంతృప్తిని తగ్గించి, గెలుపు గుర్రాలకే అవకాశం కల్పించవచ్చని భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇచ్చే బీఫామ్స్ విషయంలో ఈసారి కఠినమైన నిబంధనలను అమలు చేయాలని టీపీసీసీ నిశ్చయించుకుంది. కేవలం స్క్రీనింగ్ కమిటీ సిఫారసు చేసిన అభ్యర్థులకు మాత్రమే బీఫామ్స్ అందజేయాలని, ఇందులో ఎలాంటి పైస్థాయి ఒత్తిళ్లకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం ద్వారా పార్టీలో క్రమశిక్షణను కాపాడటంతో పాటు, అర్హులైన కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని నాయకత్వం విశ్వసిస్తోంది. ఈ మేరకు కమిటీ అధికారాలను ధృవీకరిస్తూ సమావేశం కీలక ప్రకటన చేసింది.

స్క్రీనింగ్ కమిటీ ప్రతిపాదించిన అభ్యర్థుల జాబితాను ఆమోదిస్తూ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనివల్ల అభ్యర్థుల ఖరారు ప్రక్రియలో ఉన్నత స్థాయి నాయకత్వం మధ్య పూర్తి అవగాహన ఉందని స్పష్టమవుతోంది. అంతర్గత విభేదాలు పక్కన పెట్టి, అందరూ సమిష్టిగా పనిచేయాలని, కమిటీ నిర్ణయమే శిరోధార్యమని నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ తీర్మానం పార్టీలో ఉన్న గందరగోళాన్ని తొలగించి, ఎన్నికల ప్రచారంపై దృష్టి సారించేలా చేస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాబోయే కాలంలో పార్టీ భవిష్యత్తుకు సూచికలుగా మారుతాయని, అందుకే అభ్యర్థుల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభిప్రాయపడ్డారు. సామాజిక సమీకరణాలు పాటిస్తూనే, మహిళలకు మరియు యువతకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలాబలాలను అంచనా వేసి, ప్రత్యర్థి పార్టీల వ్యూహాలను చిత్తు చేసే విధంగా మన అభ్యర్థుల ఎంపిక ఉండాలని సమావేశంలో పాల్గొన్న మంత్రులు కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లడంలో స్థానిక నాయకత్వం కీలక పాత్ర పోషించాలని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ఆరు గ్యారెంటీలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, వాటిని ఓట్లుగా మార్చుకోవాల్సిన బాధ్యత అభ్యర్థులపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడక ముందే అభ్యర్థుల విషయంలో ఒక స్పష్టత రావడం వల్ల ప్రచారానికి తగినంత సమయం దొరుకుతుందని నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, అభ్యర్థుల ఎంపికలో పారదర్శకత అనేది పార్టీ ప్రతిష్టను పెంచుతుందని చెప్పారు. స్క్రీనింగ్ కమిటీ సిఫారసుల ఆధారంగానే బీఫామ్స్ పంపిణీ జరగడం వల్ల కింది స్థాయి కార్యకర్తల్లో నమ్మకం పెరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర నాయకత్వం కూడా తెలంగాణ మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, ఇక్కడ సాధించే విజయం జాతీయ స్థాయిలో పార్టీకి బలాన్నిస్తుందని ఆమె నేతలకు వివరించారు.

మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఈ భేటీలో నిర్ణయించారు. తమకు కేటాయించిన జిల్లాల్లో స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ, ఎక్కడైనా విభేదాలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. బీఫామ్స్ పంపిణీ సమయంలో ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్త వహించాలని, పార్టీ లైన్ దాటిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ క్రమశిక్షణా చర్యలు పార్టీ ఐక్యతను చాటిచెబుతాయని భావిస్తున్నారు. మొత్తానికి టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశం మున్సిపల్ పోరుకు పక్కా ప్రణాళికతో సిద్ధమైనట్లు కనిపిస్తోంది. స్క్రీనింగ్ కమిటీ నిర్ణయానికే అగ్రతాంబూలం ఇవ్వడం ద్వారా పార్టీలో ప్రజాస్వామ్య విలువలను కాపాడుతున్నామనే సంకేతాన్ని పంపారు.

# ప్రజల మధ్య నుంచే మరోసారి బరిలోకి
# ఆరో వార్డులో సుజల రాణి ధీమా

- **ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ ఆశీర్వాదాలతో పోటీ**
- **ఇళ్ల స్థలాలే మిగిలిన ప్రధాన సమస్య – ఈసారి పరిష్కారం ఖాయం**
- **అర్ధరాత్రి అయినా ప్రజల సమస్యలపై స్పందన**
- **23 వార్డుల్లోనే అత్యధిక మెజార్టీ లక్ష్యం**



**సత్తుపల్లి, విశాలభారతి :**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తోందని తోట సుజల రాణి అన్నారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత, కార్మికుల హక్కులు, రైతుల సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన అజెండాగా ముందుకు సాగుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి హామీలను అమలు చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వంగా కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న నిర్ణయాలు నేరుగా సామాన్యుల జీవితాలను మార్చుతున్నాయని, అందుకే ప్రజల్లో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగిందని తెలిపారు. అభివృద్ధితో పాటు సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ అని ఆమె కొనియాడారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నాయకత్వంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ మార్గదర్శకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతోందని సుజల రాణి అన్నారు. అదే స్ఫూర్తితో ఆరో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, వార్డు స్థాయిలో అమలు చేయడమే తన బాధ్యతగా భావిస్తున్నానని, కాంగ్రెస్ పార్టీ బలంతోనే ఇళ్ల స్థలాలు, ఇళ్లు, త్రాగునీరు, కరెంటు, డ్రైనేజీ వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీ ఆరో వార్డు కౌన్సిలర్‌గా తోట సుజల రాణి మరోసారి బరిలోకి దిగారు. గత 20 సంవత్సరాలుగా ఇదే వార్డు నుంచి పోటీ చేస్తూ ప్రజల మద్దతుతో వరుస విజయాలు సాధించిన ఆమె, గత ఎన్నికల్లో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కూడా పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఈసారి మళ్లీ కౌన్సిలర్‌గా బరిలో దిగడం వెనుక స్పష్టమైన లక్ష్యం ఉందని ఆమె తెలిపారు. ఈ ఎన్నికల్లో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌తో పాటు వార్డు పెద్దల ఆశీర్వాదాలతోనే తాను బరిలోకి దిగుతున్నట్లు సుజల రాణి పేర్కొన్నారు. వారి మార్గనిర్దేశం, ప్రోత్సాహంతో వార్డు అభివృద్ధికి మరింత బలంగా పని చేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. వార్డులోని అభివృద్ధి పనులన్నింటినీ బాధ్యతగా పూర్తి చేశానని పేర్కొన్న సుజల రాణి, సీసీ రోడ్ల పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని తెలిపారు. పెన్షన్ల విషయంలో 75 శాతం మందికి ఇప్పటికే అందించామని, మిగిలిన పెండింగ్ పెన్షన్లను కూడా ఈసారి తప్పకుండా ఇప్పిస్తామనీ హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడంలో ఎప్పుడూ వెనుకాడలేదని, చరవాణి ద్వారా సమాచారం అందితే అర్ధరాత్రి 12 గంటలైనా స్పందించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని ఆమె గుర్తుచేశారు. గెలిచిన తరువాత ఇంట్లో కూర్చోలేదని, ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కార దిశగా పనిచేశామని స్పష్టం చేశారు.

# ఉద్యమ రోజులు గుర్తుకొచ్చాయి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే దర్యాప్తు సంస్థల పేరుతో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. కేసీఆర్ నివాసం వద్ద వందలాది మంది పోలీసులను మోహరించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తూ, కేవలం పైశాచిక ఆనందం కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, హైదరాబాద్ నగరంలో పట్టపగలే కాల్పులు, దోపిడీలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని కేటీఆర్ ప్రశ్నించారు. పాలనపై పట్టు కోల్పోయిన రేవంత్ రెడ్డి సర్కార్, కేవలం ప్రతిపక్ష నేతలను వేధించడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. తెలంగాణ సహజ వనరులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని, నల్లమలసాగర్ వంటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధిని కాపాడుకోలేకపోతున్నారని, మేడారం జాతర వంటి భారీ వేడుకల నిర్వహణలో కూడా ప్రభుత్వం చేతులెత్తేసిందని ఎద్దేవా చేశారు. సింగరేణి బొగ్గు కుంభకోణం వ్యవహారంపై కేటీఆర్ ఘాటుగా స్పందిస్తూ, ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని నిలదీశారు. సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపిస్తే నిజాలు బయటకు వస్తాయని, కానీ ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని ఆరోపించారు. ఈ కుంభకోణంలో కీలక పాత్రధారుల కాల్ డేటాను బయటకు తీస్తే అసలు సూత్రధారులు ఎవరో తేలిపోతుందన్నారు. దావోస్ పర్యటన ద్వారా వచ్చాయని చెబుతున్న పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెట్టుబడుల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై జరుగుతున్న ప్రచారంపై కూడా కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఈ కేసులో ప్రభుత్వం ఆరంభం నుండి చెబుతున్న మాటలన్నీ అబద్ధాలని ఇప్పుడు తేలిపోయాయన్నారు. మొదట వ్యాపారవేత్తలు, ఆ తర్వాత సినీ తారలు



అంటూ సంచలన ఆరోపణలు చేసిన వారు, ఇప్పుడు సాక్ష్యాలు లేక మౌనం వహిస్తున్నారని గుర్తు చేశారు. కేసీఆర్ వంటి నాయకుడికి ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం లేదని, అప్పటి ప్రభుత్వానికి వచ్చిన సమాచారం అధికారిక మార్గాల ద్వారానే వచ్చిందని స్పష్టం చేశారు. ఐఏఎస్ అధికారి సజ్జనార్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, అధికారులు తీర్పులు ఇవ్వకూడదని, అక్రమమో కాదో తేల్చాల్సింది కోర్టులేనని పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్ విషయంలో కూడా కేటీఆర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు, రైతులకు ఏమాత్రం ప్రయోజనం చేకూర్చేలా లేదని విమర్శించారు. ఉపాధి హామీ నిధులను తగ్గించడం, ఎరువుల రాయితీలో కోత విధించడంపై ఆయన మండిపడ్డారు. తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే రాష్ట్రం నుంచి గెలిచిన 16 మంది ఎంపీలు మౌనంగా ఉండటం దారుణమని అన్నారు. హైదరాబాద్ నగరం ఫార్మా రంగానికి గుండెకాయ వంటిదని, అటువంటి నగరాన్ని విస్మరించి బయో ఫార్మాకు రూ. పది వేల కోట్లు కేటాయించి తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం కేంద్ర వివక్షకు నిదర్శనమన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై కేటీఆర్ సెటైర్లు వేశారు. దాదాపు 60 సార్లు ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి, రాష్ట్రానికి ఒక్క కొత్త ప్రాజెక్టునైనా తీసుకురాగలిగారా అని ప్రశ్నించారు. హైస్పీడ్ రైల్ కారిడార్ గురించి గొప్పగా చెప్పుకోవడం హాస్యాస్పదమని, భౌగోళికంగా హైదరాబాద్ మీదుగా వెళ్లడం సహజమేనని, దానిని తామేదో సాధించామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రానికి దక్కాల్సిన హక్కుల కోసం పోరాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేవలం ఢిల్లీ పెద్దల మెప్పు కోసమే పరిపాలన సాగిస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శించారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల విషయంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ, తాము ఆడంబరాలకు వెళ్లడం లేదని కేటీఆర్ వివరించారు. ఈసారి భారీ రోడ్ షోలు, సభలు ఉండవని, స్థానికంగానే ఎన్నికల ప్రచారం జరుగుతుందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే తమ కేడర్ అంతా సిద్ధంగా ఉందని, మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించాలని, ప్రజాపక్షాన నిలబడాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో బీఆర్ఎస్ ఏమాత్రం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో కానీ, బొగ్గు గనుల వేలం విషయంలో కానీ రాష్ట్రానికి నష్టం జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ తీరుపై ప్రజలు విసిగిపోయారని, సరైన సమయంలో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. కేసీఆర్ పై చేస్తున్న వ్యక్తిగత దాడులు ప్రజలు గమనిస్తున్నారని, సిట్ విచారణల పేరుతో సమయం వృధా చేయకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి సూచించారు. అభివృద్ధి కుంటుపడటం వల్లే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తాను ఎప్పుడూ క్యాడర్‌కు అండగా ఉంటానని కేటీఆర్ భరోసా ఇచ్చారు. కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే న్యాయపోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో మళ్లీ గులాబీ జెండా రెపరెపలాడుతుందని, ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టడమే తమ తదుపరి లక్ష్యమని వివరించారు. కేసీఆర్ మార్గదర్శకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని కేటీఆర్ తన చిట్‌చాట్‌లో స్పష్టం చేశారు., తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఎవరి పాదాల దగ్గరో తాకట్టు పెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు కేంద్రం కలిసి తెలంగాణను మోసం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణను మరింత ఉధృతం చేస్తామని, రాష్ట్ర ప్రజల కోసం ఏ త్యాగానికైనా సిద్ధమని చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై గళం ఎత్తుతూనే ఉంటామని, విచారణల పేరుతో తమను భయపెట్టలేరని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# తెలంగాణను దోచుకున్నోళ్లు జాతిపితలా?

**మొదటిపేజీ తరువాయి**

రావి నారాయణ రెడ్డి స్ఫూర్తిని కొనియాడిన సీఎం రేవంత్ సర్వస్వం త్యాగం చేసిన వారినే నిజమైన ఉద్యమకారులని పిలుస్తారని, కానీ అధికారంలో ఉండి వందల ఎకరాల ఫాంహౌస్‌లు, టీవీ ఛానళ్లు, వార్తాపత్రికలు నిర్మించుకున్న వారు తమను తాము ఉద్యమకారులుగా, జాతిపితలుగా ముద్ర వేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వంటి వ్యవహారాల్లో ఇటీవల కేసీఆర్ నివాసంలో జరిగిన సిట్ విచారణపై సీఎం ఘాటుగా స్పందించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, దాన్ని తెలంగాణ జాతికి జరిగిన అవమానంగా చిత్రీకరించడం భావ్యం కాదన్నారు. తప్పు చేసిన వారికి నోటీసులు ఇస్తే అది వ్యవస్థలను గౌరవించడమే అవుతుందని, అంతేకానీ దానిని రాజకీయ కోణంలో ప్రజల్లోకి తీసుకెళ్లడం సరికాదని హితవు పలికారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు ప్రజల కోసం ఆస్తులు ధారపోస్తే, కొందరు మాత్రం





అధికారాన్ని అడ్డం పెట్టుకుని వేల కోట్లు వెనకేశారని ఆరోపించారు.

గత పదేళ్ల పాలనలో నిరంకుశంగా వ్యవహరించిన తీరును ముఖ్యమంత్రి ఎండగట్టారు. ప్రొఫెసర్ కోదండరాం వంటి నిజమైన ఉద్యమకారుల ఇంటి తలుపులు బద్దలు కొట్టి, అర్ధరాత్రి పూట అరెస్టులు చేసినప్పుడు మీ ఉద్యమ స్ఫూర్తి ఎక్కడికి పోయిందని బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. అప్పట్లో పౌర హక్కులను కాలరాసి, ఇప్పుడు విచారణ సంస్థల నుంచి నోటీసులు రాగానే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా జరిగే ఏ విచారణకైనా ఎవరైనా తలవంచాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛ అనేది ప్రజలకు, ప్రజాప్రతినిధులకు సేవ కోసం ఉంటుందే తప్ప, క్రిమినల్ నేరాలకు పాల్పడటానికి కాదని రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. అధికార మదంతో చేసిన తప్పులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని, నేరాలకు పాల్పడిన వారు ఏ స్థాయిలో ఉన్నా విచారణను ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పారు. తెలంగాణ సమాజం అన్నింటినీ గమనిస్తోందని, త్యాగాలకు మరియు దోపిడీకి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తిస్తారని సీఎం అన్నారు.

బీఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తాయనేది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సాధారణంగా ఇటువంటి విమర్శలను బీఆర్ఎస్ తేలికగా తీసుకోదు. గతంలో రేవంత్ రెడ్డి చేసిన ప్రతి విమర్శకు ఆ పార్టీ నేతలు ప్రతిదాడి చేసేవారు. అయితే, ప్రస్తుతం సిట్ విచారణ సెగలు కమ్ముకుంటున్న వేళ, ఈ ఘాటు వ్యాఖ్యలను ఆ పార్టీ 'లైట్' తీసుకునే అవకాశం లేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి నేరుగా కేసీఆర్ వ్యక్తిత్వాన్ని, సంపాదనను ప్రశ్నించడం చర్చనీయాంశమైంది.

ప్రభుత్వ విచారణలను అడ్డుకోవాలని చూడటం లేదా వాటిని భావోద్వేగాలతో ముడిపెట్టడం వల్ల ప్రయోజనం ఉండదని రేవంత్ రెడ్డి పరోక్షంగా హెచ్చరించారు. పాలనలో పారదర్శకత ఉండాలని, అవినీతికి పాల్పడిన వారు శిక్ష అనుభవించక తప్పదని ఆయన తన ప్రసంగం ద్వారా సంకేతాలు పంపారు. రావి నారాయణ రెడ్డి వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగిస్తామని చెబుతూనే, గత ప్రభుత్వ తప్పిదాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన అభిప్రాయపడ్డారు.

తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కొందరు తమ స్వార్థం కోసం వాడుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూడటం లేదా విచారణలకు ఆటంకం కలిగించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. నిజమైన ప్రజా సేవకులకు ఏ విచారణకైనా భయపడాల్సిన అవసరం లేదని, తప్పు చేసిన వారు మాత్రమే కుంటి సాకులు వెతుకుతారని వ్యాఖ్యానించారు. ప్రజా హితం కోరే వారెవరైనా వ్యవస్థలకు సహకరించాలని ఆయన కోరారు.

మొత్తానికి రావి నారాయణ రెడ్డి పురస్కార వేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రక్షాళనకు వేదికగా మార్చుకున్నారు. త్యాగధనుల చరిత్రను గుర్తు చేస్తూనే, ప్రస్తుత రాజకీయాల్లో పేరుకుపోయిన అవినీతిని ఎండగట్టే ప్రయత్నం చేశారు. రాబోయే రోజుల్లో సిట్ విచారణలు మరింత వేగవంతం కానున్నాయని, బీఆర్ఎస్ నేతలు వీటికి సమాధానం చెప్పుకోవాల్సిందేనని ఆయన మాటలు స్పష్టం చేస్తున్నాయి. ఈ రాజకీయ పోరు తెలంగాణలో రానున్న రోజుల్లో మరిన్ని మలుపులు తిరిగేలా కనిపిస్తోంది.

# ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- కార్మికులు–రైతులు–ఉద్యోగులు ఐక్యంగా పోరాడాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి. మధు
- ధరల పెరుగుదల, నిరుద్యోగానికి నిరసనగా దేశవ్యాప్త సమ్మె
- ప్రజావ్యతిరేక విధానాలపై సమిష్టి ఉద్యమం అవసరం
- అన్ని ప్రజాసంఘాల సంపూర్ణ మద్దతు కోరిన సీఐటీయూ నాయకులు



**సత్తుపల్లి, విశాలభారతి:** ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి. మధు కార్మిక వర్గాన్ని పిలుపునిచ్చారు. నేటి పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, ఉద్యోగులు, ప్రజలంతా ఐక్యంగా నిలబడి తమ హక్కుల సాధన కోసం పోరాడాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారిందన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల కారణంగా కార్మిక వర్గాలు, రైతాంగం, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్మిక హక్కుల హరణ, రైతాంగ సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితులకు నిరసనగా ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలు ఈ సమ్మెలో భాగస్వాములై ఐక్య ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు చలమాల విట్టల్ రావు, జిల్లా కమిటీ సభ్యుడు కొలిక పోగు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

# జైపూర్ కాలనీలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

- బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- దర్యాప్తు చేస్తున్న ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపూర్ కాలనీ నందు ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నాగోల్ ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపూర్ కాలనీకి చెందిన తోట ఈశ్వర్ (36) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్గా పనిచేస్తున్నాడు. అతడు గత పది సంవత్సరాలుగా మద్యానికి బానిసగా మారడంతో, గత రెండు నెలలుగా అతని ప్రవర్తన అసాధారణంగా మారిందని, ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతడిని ఎర్రగడ్డ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా, వైద్యులు మద్యం పూర్తిగా మానేయాలని సూచించినప్పటికీ, అతడు మద్యపానం కొనసాగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.పోలీసుల కథనం మేరకు, 02022026న ఉదయం అతని భార్య తోట లక్ష్మి (31) విధులకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయలుదేరగా, భర్త ఆమెను జైపూర్ కాలనీ బస్‌స్టాప్ వరకు తీసుకెళ్లాడు. అదే రోజు మధ్యాహ్నం సుమారు 4 గంటల సమయంలో, పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన వారి కుమార్తె లిఖిత (7) ఇంట్లోకి వెళ్లి చూడగా, తండ్రి గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. బాలిక వెంటనే పొరుగువారికి సమాచారం ఇవ్వగా, విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించినప్పటికీ, అప్పటికే మృతి చెందినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదులో, తన భర్త మద్యపానం అలవాటు దానికి సంబంధించిన మానసిక సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని, ఈ ఘటనలో ఎవరిపైనా అనుమానం లేదని తెలిపినట్లు ఇన్స్పెక్టర్ మొహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

# స్టేషన్‌ని సందర్శించిన పెద్దపల్లి డీసీపీ

- మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు



**విశాలభారతి, గోదావరిఖని:** గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌ను పెద్దపల్లి జిల్లా డీసీపీ బి. రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ తో కలిసి సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ ఫిర్యాదుల సమస్య సత్వర పరిష్కారంకి కృషి చేస్తూ బాధితులకు పోలీసులు పై నమ్మకం భరోసా కలిగే విధంగా వ్యవహరించాలి అని సూచించారు. సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు, ట్రబుల్ మాంగర్స్, సస్పెక్ట్ షీట్స్ వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐలని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులకు కీలక ఆదేశాలు, సలహాలు, సూచనలు జారీ చేశారు.ఎన్నికల సమయంలో లా అండ్ ఆర్డర్, ప్రజా భద్రతకు ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీసీపీ ఆదేశించారు. రాజకీయ పార్టీల కార్యకలాపాలపై నిఘా పెంచి, అసాంఘిక కార్యకలాపాలను కట్టడి చేయాలని సూచించారు. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని, ఓటర్లను భయపెట్టే లేదా ప్రలోభాలకు గురిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రచారం సమయంలో, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, సీఐ ఇంద్రసేన రెడ్డి, ఎస్ఐ రమేష్, మనోహర్, అనూష, ఉన్నారు.

# ఆదిలాబాద్ జిల్లాను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

**కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**

**ఆదిలాబాద్, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఆదిలాబాద్ జిల్లాకు న్యాయంగా రావలసిన విమానాశ్రయం, యూనివర్సిటీ, ఆర్మూర్ ఆదిలాబాద్ రైల్వే లైన్, హైదరాబాద్ నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ నిధులు, వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధులు, సీసీఐ పునరుద్ధరణ సంబంధించి ఏ అంశాలు చర్చకు రాకపోవడం బాధాకరమని, ఈ విషయంలో ఆదిలాబాద్ జిల్లా ఎంపీ ఎమ్మెల్యేలు పూర్తిగా విఫలమయ్యారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు.ఈ సందర్భంగా బోథ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా స్థానిక ఎంపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు మాటలు తప్ప చేతల్లో అభివృద్ధిని చూపెట్టలేరని దానికి నిదర్శనమే ఈ కేంద్ర బడ్జెట్ అని పేర్కొన్నారు.ఆదిలాబాద్ జిల్లాకే కాకుండా తెలంగాణకు కూడా తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోలేదని, కేవలం ఓట్ల రాజకీయాల కోసమే దక్షిణ భారతదేశాన్ని వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు.గ్రామీణ భారతానికి ఊతమిచ్చే వ్యవసాయ రంగానికి, ఉపాధికి నిధులు తగ్గించారని, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లేవని, పర్వతప్రాంతాల్లో నివసించే ప్రజల కోసం ప్రత్యేక రోడ్ల ప్యాకేజీ ఇవ్వవలసి ఉన్న ఇవ్వలేదని, వ్యవసాయానికి సంబంధించిన ఎరువుల ముడి సరుకుల రేట్లు పెంచుతూ తీసుకున్న నిర్ణయం రైతాంగాన్ని కుంగదిస్తుందని, పేదవారి ఆత్మగౌరవానికి సంబంధించిన ఇంటి నిర్మాణంలో కూడా నిధులు పెంచకుండా కేవలం గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి 72వేల రూపాయలు మాత్రమే ఇవ్వడం బిజెపి సంకుచిత బుద్ధికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోద్దు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఎంపిటిసి చట్ల ఉమేష్ లువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



# ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

- పరీక్షలు పకడ్బందీగా నిర్వహణ
- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన వివిధ పరీక్షా కేంద్రాలలో ప్రాక్టికల్ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా, క్రమశిక్షణతో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షలలో ఉదయం జరిగిన జనరల్ కోర్స్‌లో 974 మంది విద్యార్థులకు గాను 948 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కోర్స్‌లో 1,381 మందికి గాను 1,324 మంది పరీక్షలకు హాజరుకాగా 57 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2,365 మందికి గాను 2,182 మంది హాజరై 83 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో జనరల్ కోర్స్‌లో 703 మందికి గాను 685 మంది హాజరై 17 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ కోర్స్‌లో 1,362 మందికి గాను 1,296 మంది హాజరై 66 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 2,065 మందికి గాను 1,982 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకా గా 83 మంది గైహాజరయ్యారని తెలిపా రు. ప్రాక్టికల్ పరీక్షల ప్రారంభ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు జిల్లాలోని మణుగూరు, ఎడులబయ్యారం, భద్రాచలం ప్రాంతాలలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న కళాశాలలను సందర్శించి పరీక్షల నిర్వహణ తీరునుపరిశీలించారు. ల్యాబ్ సదుపాయాలు, హాజరు నమోదు విధానం, ప్రశ్నపత్రాల గోప్యత, తదితర అంశాలను ఆయన సమగ్రంగా పరిశీలిం చి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం మరియు ఇంటర్మీ డియట్ విద్యా మండలి మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కళాశాల యాజమాన్యాలకు, పరీక్షా సిబ్బందికి సూచనలు చేశారు. మిగిలిన రోజుల్లో కూడా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల ను ఇదే విధంగా శాంతియుతంగా, సమర్థవంతంగా నిర్వహిస్తామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

# ఎన్నికల ప్రచారంలో వడ్డేపల్లి రాజేశ్వరరావు



**కూకట్ పల్లి, విశాలభారతి:** తెలంగాణ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల మున్సిపాలిటీ బీజేపీ ఎన్నికల ఇంచార్జ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు సోమవారం నాడు చేవెళ్ల మున్సిపాలిటీలోని 15,16,17,18 వార్డులలో బీజేపీ అభ్యర్థులు స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు.కేంద్ర ప్రభుత్వ పథకాలు, దేశ అభివృద్ధిలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న మార్పులు మున్సిపాలిటీల అభివృద్ధికి బీజేపీ తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ చేవెళ్ల మున్సిపాలిటీలో పారదర్శక పాలన అభివృద్ధి,ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన పాలన కావాలంటే బీజేపీ అభ్యర్థుల విజయం అవసరమన్నారు. మున్సిపాలిటీని అవినీతి రహితంగా అభివృద్ధి పథంలో ముందుకు నడిపించగలిగేది బీజేపీ మాత్రమే అని తెలిపారు.ప్రజలు బీజేపీ అభ్యర్థులకు పట్టం కట్టాలని కోరుతూ ఈ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి అభివృద్ధిని ఆశీర్వదించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల బీజేపీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, చేవెళ్ల సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి, మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు పాండురంగారెడ్డి, అధ్యక్షులు అనంత్ రెడ్డి,యువ నాయకులు వైభవ్ రెడ్డి ,బిజెపి వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థులు మంజులా , వనజా ,యాదయ్య పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ తెలంగాణ ద్రోహి బడ్జెట్




**ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు**

**ముషీరాబాద్, విశాలభారతి:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేక తెలంగాణ ద్రోహి బడ్జెట్ అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు అభివర్ణించారు. ఇది దేశ చరిత్రలోనే అత్యంత నిరాశాజనకమైన వరస్ట్ బడ్జెట్ గా మిగిలిపోతుందని విమర్శించారు. దేశం బాగుండాలంటే విద్య వైద్యం ప్రధానమని ఈ రెండు రంగాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ పై లిబర్టీలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పడిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మొత్తం బడ్జెట్లో విద్య వైద్యానికి కలిపి 5% కూడా నిధులు కేటాయించకపోవడం చూస్తుంటే సామాన్య ప్రజలు అంటే కేంద్ర ప్రభుత్వానికి ఎంత చులకననో స్పష్టంగా కనబడుతుందన్నారు. ఈ బడ్జెట్ కేటాయింపుల్లో యువత భవిష్యత్తును కేంద్రం తాకట్టు పెడుతుందని, ఉద్యోగాలు లేని యువతతో దేశం ఎలా ముందుకు సాగుతుందో కేంద్రం చెప్పాలని నిలదీశారు. మరొపక్క తెలంగాణ రాష్ట్రం నుంచి వేల కోట్ల రూపాయలు పన్నుల రూపంలో కేంద్రానికి వెళ్ళిపోతుంటే తిరిగి తెలంగాణకు దక్కింది సున్నా మాత్రమేనని ఇది తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న బహిరంగ వివక్షత అన్నారు. తెలంగాణకు రావలసిన ప్రాజెక్టు నిధులు అన్నిటిని కేంద్రం ఉద్దేశపూర్వకంగానే పెండింగ్లో పెట్టి తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చూపించిన నిర్లక్ష్యం చరిత్రలో నిలిచిపోతుందని తెలంగాణ ద్రోహి బడ్జెట్ కు వ్యతిరేకంగా ఆమ్ ఆద్మీ పార్టీ రోడ్డెక్కి పోరాడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ బేగ్, కొడంగల్ శ్రీనివాస్, రాజ్, రమ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలి



**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

**పాల్వంచ విశాలభారతి ;** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ను సోమవారం ఆకస్మికంగా సందర్శించడం జరిగింది.ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.5S అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని అన్నారు.అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి,పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.వర్టికల్స్ వారీగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.డయల్ 100 ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రమాద నివారణా చర్యలు చేపట్టాలని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం అక్కడ విధులలో ఉన్న సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేసారు. కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్,ఎస్సై సురేష్, టీజీఎస్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జెఫ్రీ ఎఫ్ స్టీన్ ఫైల్స్‌పై ప్రధాని మోడీ మౌనం వీడాలి

- యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎల్.బి.నగర్‌లో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం
- తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి




**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అమెరికాకు చెందిన మానవ అక్రమ రవాణా కర్త, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడిన అంతర్జాతీయ నేరస్తుడు జెఫ్రి ఎఫ్ స్టీన్ కు సంబంధించిన ఫైల్స్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ పేరు ప్రస్తావనకు రావడంపై ప్రధాని మౌనం వీడి తక్షణమే స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి డిమాండ్ చేశారు.యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎల్.బి.నగర్ చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జక్కిడి శివ చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. జెఫ్రి ఎఫ్ స్టీన్ లాంటి అత్యంత వికృతమైన అంతర్జాతీయ నేరస్తుడితో ప్రధాని మోడీ సన్నిహితంగా, సౌకర్యంగా ఉండటం దేశానికి సిగ్గుచేటు అని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో జక్కిడి సత్య తేజ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి , రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి , కర్మాన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సామిడి చరణ్ రెడ్డి , నియోజకవర్గం అధ్యక్షులు శివ కుమార్, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు సికిందర్ రెడ్డి , పలు డివిజన్‌ల అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే లక్ష్యం.. షీ టీమ్స్ డేగకన్ను




**విశాలభారతి, మల్కాజ్‌గిరి:** మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నట్లు మల్కాజ్‌గిరి మహిళా భద్రత డీసీపీ టి. ఉషా రాణి స్పష్టం చేశారు. వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తి లేదని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు. రద్దీ ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచుతూ, నేరస్థులను పట్టుకుని బాధితులకు అండగా నిలుస్తున్నామని భరోసా ఇచ్చారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో 81 మందిని అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ వెల్లడించారు. ఫోన్ కాల్స్, సోషల్ మీడియా మరియు ప్రత్యక్ష వేధింపులపై అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసులు నమోదు చేశారు. నిందితులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వృత్తిరీత్యా కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ ఇప్పిస్తూ మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. మెట్రో రైళ్లు, కాలేజీల వద్ద ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి ఆకతాయిల ఆటకట్టిస్తున్నామన్నారు. జనవరి మొదటి పక్షం రోజుల్లోనే 36 అవగాహన కార్యక్రమాల ద్వారా వేలాది మందికి చట్టాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మెట్రోలో మహిళల కోచ్‌లలోకి వచ్చే పురుషులకు జరిమానా విధిస్తున్నామని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే మల్కాజ్‌గిరి షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 8712662111ను సంప్రదించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో షీ టీమ్స్ నిరంతర నిఘా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు.

# రూ.42.50 లక్షల సీసీ రోడ్ల పనుల పరిశీలన

**కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని సాయిబాబా కాలనీలో దాదాపు రూ.42.50 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సోమవారం కాలనీవాసులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..గత ఐదు సంవత్సరాలుగా హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనపై నిరంతరంగా కృషి చేస్తున్నామని తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత కాలపరిమితిలో పూర్తవ్వాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా సంబంధిత అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అలాగే, డివిజన్‌లో మిగిలిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టి, కాలనీవాసులకు శాశ్వత ప్రయోజనం చేకూరే విధంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్లతో కాలనీలో రాకపోకల సమస్యలు తొలగి, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు తమ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్పొరేటర్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాన శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు బత్తు రవి, ప్రధాన కార్యదర్శి మహేందర్, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.




## అధికారులకు ఎన్నికల శిక్షణా తరగతులు




**విశాలభారతి, ఎన్ టి పిసి:** మునిసిపల్ సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా సోమవారం ఎన్ టి పి సి కాకతీయ కల్యాణ మండపంలో జిల్లా స్థాయిలో ప్రిసైడింగ్ ,అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు.పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో శిక్షకులు కేడం శ్రీనివాస్, ఎన్. రాజేందర్ రెడ్డి,కె.కృష్ణా రెడ్డి, జి.అంజన్ కుమార్ లు పి ఓ లు , ఎ పి ఓ లు పోలింగ్ రోజు నిర్వర్తించాల్సిన విధుల గురించి అవగాహన కల్పించారు. పి. ఓ లు , ఎ పి ఓ లుగా అంతర్గాం, ధర్మారం, ఎలిగేడు, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి ,పెద్దపల్లి, శ్రీరాంపూర్, సుల్తానాబాద్ తదితర మండలాలకు చెందిన ఉపాధ్యాయులను ఎంపిక చేసారు. రామగుండం నగర పాలక సంస్థ నుండి 332 మంది ,పెద్దపల్లి మునిసిపల్ నుండి 89 మంది, ,మంథని మునిసిపల్ నుండి 31 మంది ,సుల్తానాబాద్ నుండి 36 మంది పి ఓ లుగా ఎంపిక కాగా ఉదయం పూట వారికి శిక్షణ ఇచ్చారు. అంతే మొత్తంలో ఉన్న అసిస్టెంట్ పి ఓ లకు మధ్యాహ్నం శిక్షణ ఇచ్చారు. మంథని ,పెద్దపల్లి,సుల్తానాబాద్ మునిసిపల్ కమిషనర్ లు మనోహర్,వెంకటేష్,రమేష్, నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర, అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ . ఓ ఆంజనేయులు సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ . మున్సిపల్ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు కె. పద్మజా రాణి శిక్షణా శిబిరాన్ని సందర్శించారు.

## బస్తీల్లో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పర్యటన



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్, కట్టేదాన్ డివిజన్‌లో ఉన్న ఉద్దంగడ్డ, పల్లె చెరువు బస్తీల్లో ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీల్లో నెలకొన్న ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ లైన్ల పునరుద్ధరణ నిరంతర తాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందుల పరిష్కారం కొత్త సీసీ రోడ్ల నిర్మాణం నిరంతరం వెలిగేలా వీధి దీపాల ఏర్పాటు బస్తీలోని స్మశాన వాటికలో అవసరమైన కనీస మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎమ్మెల్యే వెంట అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు. బస్తీల్లో గుర్తించిన సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే ప్రణాళికలు సిద్ధం చేసి పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారిపై వీధి కుక్కల బీభత్సం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలోని జన్వాడ ఎస్సీ బస్తీలో సోమవారం ఉదయం వీధి కుక్కల దాడిలో రెండేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడ్డాడు. అకస్మాత్తుగా చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేయడంతో స్థానికులు అప్రమత్తమై కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే బాలుడి చెవి, పెదవి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చిన్నారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కలు నియంత్రణ లేకుండా తిరుగుతున్నాయని, గతంలోనూ చిన్నారులపై దాడులు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేంద్ర బడ్జెట్ తెలంగాణకు గుండు సున్నా

**సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**




**సికింద్రాబాద్, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, ఇది పూర్తిగా నిరాశ జనకమైన బడ్జెట్ అన్నారు. రాష్ట్రం నుండి కేంద్రానికి వేల కోట్ల రూపాయల పన్నులు వెళ్తున్నప్పటికీ, తిరిగి నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూపిందని ఆయన మండిపడ్డారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తకపోవడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధిలేమికి నిదర్శనమని అన్నారు.నిరుద్యోగం ధరల పెరుగుదల పెట్రోల్, డీజిల్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల నిత్యావసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోతున్నాయి. దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే, యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట ప్రణాళికలేవీ ఈ బడ్జెట్ లో లేవు. యువత, మహిళ సంస్కరణలను ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిందని కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ 9 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్పా. పేద, మధ్య తరగతి, రైతు, మహిళలకు ఒరిగింది ఏమీ లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్రబడ్జెట్ లో ఎలాంటి చర్యలు తీసుకోలేదని చివరగా, ఈ బడ్జెట్ కేవలం అంకెల గారడీ తప్ప, సామాన్య ప్రజలకు, రైతులకు, కార్మికులకు ఒరిగేదేమీ లేదని, ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని ఆయన అభివర్ణించారు.

## సంకల్పం,పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే

**ఓయూ నుండి పీహెచ్డీ పట్టా పొందిన డాక్టర్ స్వప్న నూనె**



**సికింద్రాబాద్, విశాలభారతి:** సాధించాలన్న సంకల్పం, పట్టుదల ఉంటే ఎన్ని అవరోధాలు ఎదురైన లక్ష్యాన్ని అడ్డుకోలేవు అని డా.స్వప్న నూనె అన్నారు.అనేక అవరోధాలు, పేదరికం ఎదుర్కొని గ్రామీణ ప్రాంతం నుండి అత్యంత ప్రతిష్టాత్మకమైన వందేళ్ళ ఓయూలో డిపార్ట్మెంట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్మెంట్లో సీనియర్ ప్రొఫెసర్ వెంకటయ్య పర్యవేక్షణలో "ఇంపాక్ట్ మైక్రో ఫైనాన్స్ ఆన్ ఎంపవర్మేట్ అఫ్ ది రూరల్ ఉమెన్" అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి ఉస్మానియా యూనివర్సిటీ నుండి పిహెచ్డి పట్టా పొందింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ . ఇంటర్ ,డిగ్రీ ,పీజీ అంతా సంక్షేమ హాస్టల్లో చదువుకుంటూ ఫీజులు,పుస్తకాలు కొనుక్కోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొనేది వీటి కొరకు ట్యూషన్ లు చెప్పుతూ తన విద్యాభ్యాసం కొనసాగించింది.

## రాజకీయాలు దిగజారిపోయాయి

**వల్లారపు శ్రీనివాస్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** చంద్రబాబుపై అంబటి రాంబాబు మాట్లాడిన మాటలు క్షమించరానివి, రాజకీయాలు దిగజారిపోయాయి అనడానికి అంబటి రాంబాబు మాటలు నిదర్శనం. చేసిన పాపానికి సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి అచ్చోసిన ఆంబోతుల్లా అసత్యాలు ప్రచారం చేస్తూ నాటకాలాడుతున్నారని తెలుగుదేశం పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ వల్లారపు శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. హద్దు అదుపులేకుండా నీచమైన బాష, బూతులతో నాయకులను కించపరుస్తూ అంబటి రాంబాబు మాట్లాడిన మాటలు సభ్యసమాజం సహించకూడదు. రాష్ట్రంలో మళ్ళీ బూతుల సంస్కృతిని తెరపైకి తెస్తున్న వైసీపీ నేతలు రాజకీయాలను కలుషితం చేస్తూ గొడవలు సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా చంద్రబాబు కుటుంబాన్ని అంబటి రాంబాబు అవమానించాడు. నేడు అంబటి ఒక ఆంబోతులా ప్రవర్తిస్తూ చంద్రబాబుపై దుర్భాషలాడుతున్నాడు. అంబటి రాంబాబును రాజకీయాల నుంచి బహిష్కరించాలి. గతంలో వైసీపీ నేతలు అసెంబ్లీలో మహిళలపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసే 11 సీట్లకు పరిమితమయ్యారు. ఈ రోజు మాట్లాడిన బాష, రెచ్చగొడుతున్న తీరు చూస్తేంటే వైసీపీ నేతలు ప్రజాజీవితంలో ఉండడానికే అర్హులు కాదు. ఇటువంటి బూతులు భవిష్యత్తులో ఎవరూ మాట్లాడకుండా కేసు నమోదు చేసి సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

# విజిలెన్స్ వారసుల సమస్యలకు మోక్షం

- **ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్**



**విశాలభారతి, గోదావరిఖని:** సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మారు పేర్లు మరియు విజిలెన్స్ కేసుల సమస్యను పరిష్కరించి, కార్మిక బిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ స్పష్టం చేశారు. సోమవారం నాడు రామగుండం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు అనేక హామీలు ఇచ్చి, మెడికల్ ఇన్వాలిడేషన్ పద్ధతిలో వారసులకు ఉద్యోగాలు ఇచ్చే విషయంలో వారిని మోసం చేసిందని మక్కన్ సింగ్ విమర్శించారు. విజిలెన్స్ విచారణల పేరుతో కార్మికుల పిల్లలను ఇబ్బందులకు గురిచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పని నైజం భూపాలపల్లి సభలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగరేణి వారసుల సమస్యల పరిష్కారానికి కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.త్వరలోనే అధికారిక సమావేశం మారు పేర్లు మరియు విజిలెన్స్ పెండింగ్ కేసుల పరిష్కారంపై ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు సోషల్ మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే కోల్ ఏరియాకు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వం ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బాధిత కార్మికుల కుటుంబ సభ్యులు లక్క శ్రావణ్ గౌడ్, పర్తపల్లి హరీష్, జక్కు శ్రావణ్, డిష్ బాబు , సందీప్, ఓం ప్రకాష్, దాస్నడ రాజు, ఆవుల రవి, ప్రదీప్ పాల్గొన్నారు .

## రేగాకి రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్




**విశాలభారతి, కరకగూడెం:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన అభిమాన నాయకులు అభివృద్ధి పదాత పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి నిన్న మణుగూరులో జరిగిన నిరసన కార్యక్రమం పేరుతో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మతిభ్రమించినట్లుగా వ్యవహరిస్తూ చేతిలో కర్ర పట్టుకొని పోలీసులను సైతం లెక్కచేయకుండా రౌడీ రాజకీయానికి తెరలేపడం తీవ్రంగా ఖండిస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఆనాడు పార్టీకి ద్రోహం చేసి అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరిన పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రాజకీయ జీవితాన్ని మరిచి నేడు కాంగ్రెస్ నాయకులను కార్యకర్తలను మీడియా ముందు బూతులు తిట్టడం గర్హించదగ్గ చర్య అని అన్నారు. అధికారం పోయింది అని అసహనంతో జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేశారు. మీడియా సాక్షిగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వీధి రౌడీలా ప్రవర్తించడం మాజీ ప్రజా ప్రతినిధికి తగదని మండిపడ్డారు. గతంలో టీచర్ గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన నువ్వు ఈ విధంగా ప్రవర్తించడం అంటె ఇదేనా నీ విజ్ఞానం అని ప్రశ్నించారు. తక్షణమే మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలేబోయిన సుజాత , మాజీ సర్పంచ్ నియోజకవర్గ నాయకులు తోలేం నాగేశ్వరరావు , ఉపసర్పంచులు పూజారి వెంకన్న , ఈసం కోటేశ్వరరావు మండల నాయకులు ఎర్ర సురేష్ , జలగం కృష్ణ గొగ్గలి రవి షేక్ రఫీ పడిగ సమ్మయ్య భూక్యా రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల భద్రతే ఆపరేషన్ స్మైల్ లక్ష్యం

- **పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝూ**




**విశాలాభారతి, గోదావరిఖని:**

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి సంవత్సరం రెండు సార్లు ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, వదిలివేయబడిన, అలాగే కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్ళు, వివిధ కంపెనీలు మరియు రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించి, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించడం లేదా అవసరమైతే చిల్డ్రన్ హోమ్‌లకు పంపించడం జరుగుతుంది. దీనిలో భాగంగా రామగుండము పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఆపరేషన్ స్మైల్-XII కార్యక్రమాన్ని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీస్ అధికారులు, సిబ్బంది, అలాగే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్ డిపార్ట్మెంట్, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్, చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్, హెల్త్ డిపార్ట్మెంట్ తదితర ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని రామగుండము పోలీస్ కమీషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝూ ఒక ప్రకటనలో తెలిపారు.రామగుండము కమీషనరేట్ పరిధిలో ప్రతి డివిజన్‌కు ఒక ఎస్.ఐ మరియు నలుగురు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థలను గుర్తించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.ఈ సంవత్సరం జనవరి 1 నుండి 31 వరకు కమీషనరేట్ వ్యాప్తంగా ఆపరేషన్ స్మైల్-XII కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించగా, మొత్తం (166) మంది బాల బాలికలను గుర్తించినట్లు వెల్లడించారు.పెద్దపల్లి జిల్లా పరిధిలో బాలురు - 30, బాలికలు - 18, మొత్తం - 48 మందిని గుర్తించి, 05 కేసులు నమోదు చేసి 05 మందిని అరెస్ట్ చేయడం జరిగింది.మంచిర్యాల జిల్లా పరిధిలో* బాలురు - 93, బాలికలు - 25, మొత్తం - 118 మందిని గుర్తించి, 15 కేసులు నమోదు చేసి 15 మందిని అరెస్ట్ చేయడం జరిగింది.

## కోదాడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి



**ఎమ్మెల్యే పద్మావతి**

**కోదాడ, విశాలభారతి:** కోదాడ మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరాలనీ కోదాడ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ అన్నారు. సోమ వారం కోదాడ మున్సిపల్ పరిధిలోని 31వ వార్డు లో మాజీ సర్పంచ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్నేని వెంకట్ రత్నం బాబు, స్థానిక వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కుసుమ వెంకట్ రత్నం బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. జరగబోయే 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయ ఢంకా మోగించాలన్నారు. కార్యకర్తలు పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలన్నారు.స్థానిక 31వ వార్డు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు ను రికార్డు మెజార్టీతో గెలిపించాలన్నారు.పార్టీ అభ్యర్థుల గెలుపు కు కృషి చేసే వారందరికీ తప్పక గుర్తిస్తాం అన్నారు. మంత్రి ఉత్తమ్ గాని, తాను కానీ పార్టీ గెలుపు కోసం కృషి చేసే ప్రతి నాయకుడిని, కార్యకర్త ను అన్యాయం చేయం అన్నారు. పరస్పర సహకారం సమన్వయం తో పని చేయాలనీ సూచించారు. మంత్రి ఉత్తమ్ సహకారం తో కోదాడ ను అభివృద్ధి లో అగ్ర స్థానంలో నిలుపుతా అన్నారు. ఇప్పటికే వేల కోట్ల రూపాయల నిధులు తెచ్చా అన్నారు.కోదాడ మున్సిపాలిటీ 35 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మంత్రి ఉత్తమ్ కు కానుకగా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అభ్యర్థి కుసుమ బాబు, పట్టణ నాయకులు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు ప్రముఖులు ఉన్నారు.

## అడ్డగుట్టను సిపిఐకి కేటాయించాలి

- **సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి.. కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్**




**సికింద్రాబాద్, విశాలభారతి:** కాంగ్రెస్,సిపిఐ పార్టీ అవగాహనలో భాగంగా అడ్డగుట్టను రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో సిపిఐకి కేటాయించాలి అని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ కి విజ్ఞప్తి చేశారు. అడ్డగుట్ట సిపిఐ కార్యాలయం శ్రామిక భవన్ లో గౌరీ నాగరాజ్ అధ్యక్షన సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల రాజీలేని పోరాట ఫలితంగానే అడ్డగుట్ట ఏర్పాటయిందని, ఏర్పాటులో కమ్యూనిస్టు పార్టీ నాయకుల త్యాగాలు ఉన్నాయని, అడ్డగుట్ట సమస్యల పట్ల సంపూర్ణమైన అవగాహన ఉన్నది కావున రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో సిపిఐ పార్టీకి కార్పొరేటర్ టికెట్ కేటాయించాలని కాంగ్రెస్ పార్టీని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అడ్డగుట్టలో సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికై రానున్న రోజుల్లో ప్రత్యేక కార్యాచరణతో ప్రజల్లోకి వెళదామని తెలియజేశారు. పార్టీ క్రియాశీలకమైన కార్యకర్తలు పార్టీ బలోపేతం కొరకై పూర్తిస్థాయిలో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాకాల యాదగిరి, సింగారయ్య, వెంకటేష్, అంజి, యాదగిరి, దస్తగిరి, కొండల్, రఫిక్ , భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సీఎం కప్ క్రీడ పోటీలు

**క్రీడలను ప్రారంభించిన ఎమ్మార్వో కాంతయ్య**



**విశాలభారతి, కరకగూడెం:** మండలంలోని తాటిగూడెం క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో కాంతయ్య మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రతిభను వెలికిదీయడమే సీఎం కప్ నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం మండల స్థాయి జరిగిన సీనియర్ విభాగం వాలీబాల్ సమత్ మోతె క్లస్టర్ మొదటి బహుమతి,జూనియర్ విభాగం వాలీబాల్ బహుమతి చిరుమల్ల క్లస్టర్,కబడ్డీ విభాగంలో చిరుమల్ల క్లస్టర్ గెలుచుకున్నారు.కోకో విభాగంలో కరకగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు.గెలిచిన విజేతలకు బహుమతులు వారు అందజేశారు.క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అసెంబ్లీకి పంపించడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నోబెల్ ఆఫీసర్ గడ్డం మంజుల వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు,సెక్రటరీలు,క్లస్టర్లు,సీనియర్ క్రీడాకారులు,క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## దంతూరి అంజమ్మకు ఘన నివాళి

- **దశదినకర్మకు హాజరైన ఏలే చంద్రశేఖర్**




**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రామన్నపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య తల్లి దంతూరి అంజమ్మ ఇటీవల పరమపదించగా, ఆమె దశదినకర్మ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై, దంతూరి అంజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధారపు లింగస్వామి, బచ్చ శ్రీనివాస్, రమేష్, అలాగే దంతూరి అంజమ్మ కుమారులు దంతూరి సత్తయ్య, దంతూరి రాములు, దంతూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై, దంతూరి అంజమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు.

## ఉద్యోగ పదవి విరమణ సన్మానం

**విశాల భారతి ,అడ్డగూడూరు:** లక్ష్మీదేవికాల్వ ఉద్యోగ సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వివిధ రకాల రంగాలలో సర్వీస్ పూర్తి చేసి పదవి విరమణ చేసిన వారికి ఉద్యోగ సహకార సంఘం ఆధ్వర్యంలో కానుగుల రాము ఆగ్రో కెమికల్ కంపెనీ, బండి భిక్షం టీచర్, పొన్నాల ఉదయ్ కుమార్ ఆర్మీ, పొన్నాల రమేష్ ఆర్మీ. దామెర్ల వీరయ్య ఆర్మీ, బొమ్మగాని భద్రయ్య ఆర్మీ లను సర్వీస్ పూర్తి చేసిన సందర్భంగా వారికి ఉద్యోగ సహకార సంఘం ఆధ్వర్యంలోఘనంగా సన్మానం చేయటం జరిగింది. . ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవికాల్వ ఉద్యోగ సహకార సంఘం అధ్యక్షులు కంచుగట్ల క్రిష్ణయ్య , ప్రధాన కార్యదర్శి దామెర్ల వీరయ్య, ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ వల్లంబట్ల రమాదేవి , ఉపసర్పంచ్ కంబాల వీరయ్య , ఉద్యోగ సహకార సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్ కె అబ్బాస్ అలీ, సభ్యులు పొన్నాల సత్తయ్య, కందుకూరు అంజయ్య, పొన్నాల నర్సయ్య, కంచుగట్ల వెంకన్న, పనుమటి అంజయ్య , కంచుగట్ల శ్రీశైలం ,బండి వినయ్, కేసరపు ఆంజనేయులు, దామెర్ల వెంకన్న ,పొన్నాల శేఖర్, బండి నాగరాజు ,రవి అశోక్ ,మమత ,గ్రామస్తులు నక్క అబ్బయ్య, బొమ్మగాని లక్ష్మయ్య, అక్కెనపెల్లి నర్సయ్య, వల్లంభట్ల రవిందర్ రావు తదితరులు పాల్గొన్నారు.



## సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులుగా సుర్వి మల్లేశం గౌడ్



చౌటుప్పల్, విశాలభారతి: మండల కేంద్రంలో సోమవారం రోజున చౌటుప్పల్ మండలం అన్ని గ్రామాల సర్పంచుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.తదనంతరం సర్పంచుల ఫోరం నూతన కమిటీని ప్రకటించడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులుగా అంకిరెడ్డి గూడెం సర్పంచ్ సుర్వి మల్లేశం గౌడ్,ఉపాధ్యక్షులు కాకి శ్రీలత,టేకుల మంజుల,ప్రధాన కార్యదర్శి తంగెళ్ల వెంకటేశం, కోశాధికారి కైరం కొండ స్వప్న, సహాయ కార్యదర్శులు అన్యాలకు నరేష్ గుండెబోయిన శిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తదనంతరం సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్ లకు అందరికీ అందుబాటులో ఉంటూ నిష్పక్షపాతంగా వారి సమస్యలను నా సహచర సభ్యులను కలుపుకొని అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారమయ్యే వరకు పోరాడుతానని తెలిపారు.ఈ ఎన్నికకు సహకరించిన అన్ని గ్రామాల సర్పంచులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రజక కులస్తుల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం



**విశాల భారతి, అడ్డగూడూర్:** మండల కేంద్రంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామానికి చెందిన బాసాని యాదగిరి గత రెండు సంవత్సరాలుగా పక్షవాత అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న అతనికి గ్రామానికి చెందిన రజకల సహకారంతో ఆదివారం రూ. 58 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రజక లు దామర్ల వీరయ్య, నీలగిరి శ్రీను, దామెర్ల వెంకన్న దామర్ల పిచ్చయ్య పలువురు మాట్లాడుతూ . మన కులంలో ఇలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అందరికీ మనం మన కులము అందరం కలిసికట్టుగా ఉండి ఇలాంటి సహాయాలు మరెన్నో చేయాలి ఇలాగే ముందుకు సాగాలని ఇలాగే కలిసికట్టుగా పనిచేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నాల సత్తయ్య, పొన్నాల రమేష్, పొన్నాల భాస్కరు, దామెర్ల యాదగిరి, పొన్నాల సైదులు కొన్నారా శేఖర్ దామర్లకోటయ్య దామర్ల అంజయ్య పొన్నాల వీరయ్య, పొన్నాల పుల్లయ్య, పొన్నల రాములు యాదగిరి దామర్ల పిచ్చయ్య అక్కెనపల్లి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## అజింపేట సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేత



**అడ్డగూడూర్, విశాలభారతి:** మండలం పరిధిలోని అజీంపేట సబ్ స్టేషన్ లో మంగళవారం రోజున రెండు ఫీడర్లకు డి రేపాక మరియు అజీంపేట ఫీడర్ల గ్రామాలకు ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుంది అడ్డగూడూర్ విద్యుత్ ఏఈ భూక్యా ఉమా తెలిపారు ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ వేసవి కాలంలో సబ్ స్టేషన్ లో విద్యుత్ కు అంతరాయం కలగకుండా నాణ్యమైన విద్యుత్ అందిచడానికి ఇప్పుడు ఉన్న 5 ఏం వి ఏ పవర్ ట్రాన్సపార్మర్ స్థానం లో అదనపు 8 ఏం వి ఏ ట్రాన్సపార్మర్ ను ఏర్పాటు చేయడం జరుగుతుంది అలాగే చిన్న చిన్న మార్మతులు కూడా చేయడం జరుగుతుంది కాబట్టి రెండు ఫీడర్ల గ్రామాల రైతులు, విద్యుత్ వినియోగదారులు మాకు సహకరించగలరు అని మనవి చేస్తున్నాము

## 17 ఏళ్ల బాలుడు గల్లంతు



**రాజేంద్రనగర్ విశాలభారతి:** డెకరేషన్ పని కోసం నగరానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన 17 ఏళ్ల బాలుడు కనిపించకుండా పోయిన ఘటనకు సంబంధించిన కేసు పోలీస్ స్టేషన్లో నమోదైంది. బాధితుడి తల్లికి ఇద్దరు కుమారులు ఉండగా, పెద్ద కుమారుడు రాఘవేందర్ (19) కాగా, చిన్న కుమారుడు (17) డెకరేషన్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తేదీ 31.01.2026 సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో చిన్న కుమారుడు డెకరేషన్ పని కోసం సిటీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్లాడు. అదే రోజు రాత్రి అతని మొబైల్ నెంబర్ 8977703197కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చిందని ఫిర్యాదిదారురాలు తెలిపింది. మరుసటి రోజు ఇంటికి తిరిగి వస్తాడని కుటుంబ సభ్యులు భావించినప్పటికీ, ఇప్పటివరకు అతడు తిరిగి రాలేదు. బాధితుడి కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఎలాంటి సమాచారం లభించకపోవడంతో ఫిర్యాదిదారురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. గల్లంతైన బాలుడి ఎత్తు సుమారు 4.5 అడుగులు, చామనఛాయ రంగు, తెలుపు రంగు చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. అతడు తెలుగు, హిందీ, లంబాడీ భాషలు మాట్లాడగలడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విలువలు అందించే పుస్తకం ఘంటారావం

- డాక్టర్ నమోజు బాలా చారి



**ముషీరాబాద్, విశాలభారతి:** విలువలతో అందించే పుస్తకం ఘంటారావం అని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలా చారి అన్నారు.తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన గంట మనోహర్ రెడ్డి రచించిన ఘంటారావం పుస్తక పరిచయ సభ జరిగింది. ఈ సభలో డాక్టర్ నమోజు బాలా చారి మాట్లాడుతూ గంటా మనోహర్ రెడ్డి ఘంటారావం పేరుతో సమాజంలో జరిగే విషయాలు భారతంలో భాగవతంలో రామాయణంలోని విషయాలను కళ్ళకు కట్టినట్లు నేటి సమాజానికి ఉపయోగపట్లు రాస్తున్న కవిత్వం అభినందనీయమన్నారు. డాక్టర్ బి జయ రాములు, గౌరీ శంకర్, బడే సాబ్, రాధాకుసుమ, చంద్ర ప్రకాష్ రెడ్డి, సరోజినీ, సత్యనారాయణ, కుమార్, ఉపేంద్ర, సురేష్, విజయ్ కుమార్ హాజరై పుస్తకం పై మాట్లాడారు.

## ప్రతి సోమవారం ప్రజావాణి




**రాజేంద్రనగర్, విశాలభారతి:** 02.02.2026న ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు రాజేంద్రనగర్ సర్కిల్-19 పరిధిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారార్థం దరఖాస్తులు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమం ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు క్రమం తప్పకుండా నిర్వహించబడును. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరిస్తారు. కావున రాజేంద్రనగర్ సర్కిల్-19 పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడమైనది.


# కమ్యూనిటీ హాల్ ప్రారంభం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** మన్సూరాబాద్ డివిజన్ (ప్రస్తుత లెక్చరర్స్ కాలనీ డివిజన్) పరిధిలోని రాజ రాజేశ్వరి కాలనీ ఫేజ్-2లో కాలనీవాసులు స్వయంగా నిర్మించుకున్న కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో కలిసి పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాలనీవాసులు తమ సొంత నిధులతో సుమారు రూ.45 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ భవనం నిర్మించుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. ప్రజలు ఐక్యతతో ముందుకు వస్తే అభివృద్ధి సాధ్యమవుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు.అలాగే, ప్రస్తుత మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ "శిలా ఫలకాలు - శాల్వలు"కే పరిమితమై తిరుగుతున్నాడే తప్ప, కాలనీ అభివృద్ధిపై శ్రద్ధ చూపడంలేదని విమర్శించారు. అలాంటి అసమర్థ నాయకులకు రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నాయకులు పని చేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రతి కాలనీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను తక్షణమే పరిశీలించి, అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, హయత్ నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, కొసనం వెంకట్ రెడ్డి, చంద్రా రెడ్డి, విజయేందర్ రెడ్డి, అనిల్ కుమార్, నాగార్జున, పరమేశ్ గౌడ్, పొరంద నర్సింగ్, కాలనీ అధ్యక్షులు మాధవ్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, పెద్దలు, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో మర్పల్లి కాంగ్రెస్ నాయకులు



**మర్పల్లి, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ కూతురు గడ్డం అనన్య గెలిపే లక్ష్యంగా మర్పల్లి మండల కాంగ్రెస్ నాయకులు పసియుద్దిన్, మహేష్ , వెంకట్ వికారాబాద్ నియోజకవర్గ శివరామ్ నగర్ కాలనీలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయమే ధ్యేయంగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. వికారాబాద్ లోని శివరామ్ నగర్ కాలనీలో నీ 31వ వార్డు అభ్యర్థి మల్లికార్జున గౌడ్,32 బాదం అనురాధఅశోక్ తరపున ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు పసియోద్దీన్, మహేష్ మరియు వెంకట్ గారు వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి, కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ, "చేతి గుర్తు"కే మీ అమూల్యమైన ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.గడ్డం అనన్య నాయకత్వంలో వికారాబాద్ మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించాలని వారు కోరారు.

## ఆశీర్వదించండి అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తా

- గట్టు మొగులయ్య
  5 వార్డు కౌన్సిలర్ అభ్యర్థి



**చౌటుప్పల్, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలోని 5 వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గట్టు మొగలయ్య ముదిరాజ్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసి సోమవారం రోజున నేడు పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేతుల మీదుగా బి ఫారం అందుకోవడం జరిగింది.ఈ సందర్భంగా శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థులతో చౌటుప్పల్ మున్సిపాలిటీలో బలమైన పోటీకి టీఆర్పీ సిద్ధమైందని అన్నారు.మల్లన్న అవినీతికి వ్యతిరేకంగా,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో పార్టీ ముందుకు సాగనుందని చౌటుప్పల్ మున్సిపాలిటీలో మార్పు కోరుకునే ప్రజల ఆశలకు ప్రతినిధిగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఈ ఎన్నికల్లో బలమైన పాత్ర పోషించబోతోందనీ పేర్కొంటూ వార్డు ప్రజలు కత్తెర గుర్తుపై ఓటు వేసి తెలంగాణ రాజ్యాధికార పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తదనంతరం కౌన్సిలర్ అభ్యర్థి గట్టు మొగులయ్య మాట్లాడుతూ ఐదో వార్డ్ లో నన్ను ఆశీర్వదించండి అభివృద్ధి అంటే ఏంటో నేను చేసి చూపిస్తానని సందర్భంగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిఆర్పి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాగాని హరి శంకర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ ఇంచార్జ్ వట్టే జానయ్య యాదవ్,రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నరసయ్య గౌడ్,రాష్ట్ర నాయకులు తిరుమణి నాగరాజు గౌడ్,జెట్ట కృష్ణ,వేణు కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నందివనపర్తిలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్




- జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నీ
- టోర్నమెంట్ గోడపత్రిక ఆవిష్కరణ
- జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకం కృష్ణ

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు యూత్ అధ్యక్షుడు నూకం కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నందివనపర్తిలోని జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో కలిసి వాలీబాల్ టోర్నమెంట్ గోడపత్రికను నూకం కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం నూకం కృష్ణ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ ఈనెల 15న ప్రారంభమై 16తేదీన ముగుస్తుందని తెలిపారు. టోర్నమెంట్ లో పాల్గొనే జట్లు ఎలాంటి ఎంట్రీ ఫీజు లేకుండా ఈ నెల 14న రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న జట్టు ఆటగాళ్ల ఆధార్ తప్పనిసరిగా తీసుకురావాలని చెప్పారు. ఫైనల్లో విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటుగా రూ . 30 వేలు, రన్నరప్ జట్టుకు ట్రోఫీ తో పాటుగా రూ. 15 వేలు, తృతీయ బహుమతి రూ . 7 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ వివరాల కోసం 9000631896 , 8008669662, 9885920161 ఈ నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అమ్మో ఒకటో తారీకు లాగా కేంద్ర బడ్జెట్

**ముషీరాబాద్,విశాల భారతి:** అమ్మో ఒకటో తారీకు లాగా కేంద్ర బడ్జెట్ ఉందని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ తెలంగాణ విమర్శించింది. సోమవారం నల్లకుంట లోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఏ రాజేంద్ర బాబు, ఎంవి నర్సింగ్ రావు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్ కు చాలా నిరాశ కలిగించిందన్నారు. ఆకాశాన్నంటిన నిత్యవసర వస్తువులు ఆసుపత్రుల ఖర్చులు వయోవృద్ధులు తీవ్రమైన ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు. 60 ఏళ్లు వయసు దాటిన వృద్ధులకు ఆదాయ పన్నులో రాయితీలు, సంక్షేమ పథకం ఏదైనా ప్రకటిస్తారని ఆశించామని కానీ ఆ ప్రస్తావన తీసుకరాకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు.

## నన్ను గెలిపించండి 15వ వార్డు అభివృధి చేస్తా

- అప్పల సంధ్య సురేష్ యాదవ్




**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీలోని 15వ వార్డు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని టీఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థి అప్పల సంధ్య సురేష్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆమె 15వ వార్డులో కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మాట్లాడారు. వార్డు సభ్యులు, నాయకుల సంపూర్ణ మద్దతుతో ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తానని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యల పరిష్కారం, సీసీ రోడ్ల నిర్మాణం, పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వార్డు అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా చేసుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతానని, సేవ చేయడానికి తనకు ఒక అవకాశం ఇవ్వాలని ఆమె కోరారు. టీఆర్ఎస్ పార్టీని బలపరిచి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికతో ముందుకు సాగుతానని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీలోనే మున్సిపల్ అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

## అసోసియేషన్ సభ్యులను సన్మానించిన తుంగతుర్తి రవి



**మేడిపల్లి, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేట్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని 9 వ డివిజన్ మేడిపల్లి ధరణి కాలనీ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికలలో కాలనీ అధ్యక్షులుగా చింతం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా బీమిడి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా గూగులోతు చంద్రశేఖర్ లు గెలుపొందారు. ఈ సందర్భంగా విజేతలు.. కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి అసోసియేషన్ సభ్యులను శాలువాతో సత్కరించి,శుభాకాంక్షలు తెలియజేసి కాలనీ అభివృద్ధి కోసం తనవంతు సహాయంగా వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎలాంటి సమస్యలు ఉన్న వాటి పరిష్కార దిశగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో శ్రీలత భద్రు నాయక్, మనిరాం నాయక్, మహ్మద్ మజర్, నాగరాజు, కాలనీ మాజీ అధ్యక్షులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సుమా రెసిడెన్సీ నూతన పాలకవర్గానికి రవి సన్మానం



**మేడిపల్లి, విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ సర్కిల్, 9వ డివిజన్ మేడిపల్లిలోని సుమా రెసిడెన్సీ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన పాలకవర్గ సభ్యులను పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి కలిసి, వారిని సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎం. శరత్ బాబు, ప్రధాన కార్యదర్శి ఎం. కిషోర్ గౌడ్, ఉపాధ్యక్షులు కె. చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శులు డి. అక్షిత్ యాదవ్, ఎం. చంద్రకాంత్, కోశాధికారి టి. మురళి, గౌరవ ముఖ్య సలహాదారు ఎస్. శ్యామ్ రావు, సలహాదారులు ఎం. సుభాష్, జంగారెడ్డిలను కె. గణేష్, ఎం. రవికాంత్, సారం బాబు, వి. లక్ష్మణ్ రావు, ఎస్. ప్రశాంత్, వైస్ కెప్టెన్ వెంకట్ వర్మ, జె. సత్యనారాయణ, ఎం. విష్ణు వర్ధన్ రావు, టి. ఏ బి విశాల్ రెడ్డి, ఎం. నవాజ్, లక్ష్మీనారాయణ లనుఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం నూతన కమిటీ సభ్యులు కలిసికట్టుగా పనిచేయాలని, నివాసితుల సమస్యల పరిష్కారంలో తమ వంతు పూర్తి సహకారం ఉంటుందని రవి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన ప్రతి సభ్యునికి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ మజర్, మనిరాం నాయక్, నాగ రాజు,వెంకటేష్ గౌడ్ (చింటూ)మరియు కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారం నిర్వహిస్తున్న 12వార్డు కౌన్సిలర్ అభ్యర్థి



**మొయినాబాద్ , విశాలభారతి:** మొయినాబాద్ మున్సిపాలిటీలోని 12 వార్డులో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బలపరిచినటువంటి అవురం విక్రం రెడ్డి తనకు ఓటు వేసి గెలిపించాలని 12వ వార్డు ప్రజలను కోరడమైనది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని కాంగ్రెస్ పార్టీలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను చూసి తనకు ఓటు వేయాల్సిందిగా కోరుచున్నాను. 12వ వార్డులో ఎవరికి ఏ కష్టం వచ్చి నా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఇదివరకే తాను గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహాయపడ్డారని తెలియజేశారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా, దోహదపడతానని హామీ ఇచ్చారు. ఇదివరకు మూర్తుజగూడలో ఎవరికైనా ఆపద వస్తే తక్షణమే వెళ్లి వారికి తగిన ఆర్థిక సాయం అందించే వాడినని తెలియచేశారు. గ్రామంలో దేవాలయాలకు, పాఠశాల విద్యార్థులకు బుక్స్ పెన్స్ పంపిణీచేసే వాడినని. మన గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నదనీ తెలియచేశారు.

## 42వ డివిజన్ నుంచి జేనసేన అభ్యర్థిగా బరిలో బూదె గిరి



**పాల్వంచ విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 42 వ డివిజన్ నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా బూదె గిరి బరిలో నిలిచారు. ఈ సందర్భంగా బూదె గిరి మాట్లాడుతూ, 42 డివిజన్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ప్రథమ కర్తవ్యమని తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ 42 వ డివిజన్ ప్రాంతంలో నెలకొన్న తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలందరికీ చేర వేయడమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు.

# సుధీ హ్యాకథాన్ 2026ను నిర్వహించనున్న సీబీఐటీ

**హైదరాబాద్, విశాలభారతి:** గండిపేటలోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తన వార్షిక సాంకేతిక ఉత్సవం సుధీ లో భాగంగా సుధీ హ్యాకథాన్ 2026ను నిర్వహించనుంది. యువ ఇంజినీరింగ్ విద్యార్థులు తమ ఆవిష్కరణలు, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఈ హ్యాకథాన్ ఒక చురుకైన వేదికగా నిలవనుంది. ఈ హ్యాకథాన్‌కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను కళాశాల ప్రాంగణంలో నేడు ఆవిష్కరించారు. ఈ హ్యాకథాన్‌ను రెండు దశలుగా నిర్వహించనున్నారు. మొదటి దశగా ఆన్‌లైన్ ప్రెసెంటేషన్ సమర్పణ రౌండ్, అనంతరం సీబీఐటీ క్యాంపస్‌లో ఆఫ్‌లైన్ హ్యాకథాన్ నిర్వహించబడుతుంది. మొదటి రౌండ్ ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది. ఇందులో బృందాలు ముందుగా నమోదు



చేసుకుని, తమ ప్రతిపాదిత పరిష్కారాన్ని వివరిస్తూ ప్రెసెంటేషన్ ను సమర్పించాలి. ప్రెసెంటేషన్ సమర్పణకు చివరి తేదీ ఫిబ్రవరి 10, 2026 కాగా, సమర్పణకు సంబంధించిన గూగుల్ ఫారాన్ని ఫిబ్రవరి 5, 2026న విడుదల చేస్తారు. మూల్యాంకనం ఆధారంగా ఎంపికైన బృందాలు రెండో దశకు అర్హత పొందుతాయి. రెండో రౌండ్ (ఆఫ్‌లైన్ హ్యాకథాన్) ఫిబ్రవరి 14, 2026న హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ క్యాంపస్‌లో జరుగుతుంది. ఈ దశలో పాల్గొనే బృందాలు వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారంగా పనిచేసే ప్రోటోటైప్‌ను అభివృద్ధి చేసి, నిపుణుల జ్యూరీ ముందు తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా. సి.వి. నరసింహులు, వైస్ ప్రిన్సిపాళ్లు, సుధీ హ్యాకథాన్ కన్వీనర్ డా. ఏ. సిరీష, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థి సమన్వయకర్తలు పాల్గొన్నారు. విద్యార్థుల్లో ఆవిష్కరణాత్మక ఆలోచన, సహకారం మరియు ప్రాయోగిక సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే ఈ కార్యక్రమాన్ని వారు ప్రశంసించారు.

## దంతూరి అంజమ్మకు ఘన నివాళి

- దశదినకర్మకు హాజరైన ఏలే చంద్రశేఖర్



**వలిగొండ, విశాలభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన రామన్నపేట సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య తల్లి దంతూరి అంజమ్మ ఇటీవల పరమపదించగా, ఆమె దశదినకర్మ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై, దంతూరి అంజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బంధారపు లింగస్వామి, బచ్చ శ్రీనివాస్, రమేష్, అలాగే దంతూరి అంజమ్మ కుమారులు దంతూరి సత్తయ్య, దంతూరి రాములు, దంతూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై, దంతూరి అంజమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీజేపీ అధ్యక్షుడు



**చౌటుప్పల్ విశాలభారతి:** మున్సిపాలిటీలోని రెండో వార్డుకు చెందిన బిజెపి పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి యాదగిరి బిజెపి పార్టీ సీనియర్ నాయకులు సుర్వి నరేష్ గౌడ్ మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లో చేరూరు.వారితోపాటు వారి కుటుంబ సభ్యులు పార్టీలో చేరి కాంగ్రెస్ పార్టీ గెలుపుకు నిరంతరం పనిచేస్తానని హామీ ఇచ్చారు.అలాగే రెండవ వార్డ్ అభ్యర్థి సుర్వి మంజుల నరసింహ గౌడ్ ని ప్రచారం చేసి గెలిపిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య,సుర్వి ఆంజనేయులు గౌడ్,చౌటుప్పల్ మున్సిపల్ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్,దోనకొండ కృష్ణ, గుత్తా శ్రీధర్ రెడ్డి, దొనకొండ నరసింహ, ఊదరి నరసింహ, కొసనం రాకేష్ రెడ్డి, బొంగు ప్రవీణ్ గౌడ్, సుర్వి మహేష్ గౌడ్, మట్టపల్లి శ్రీశైలం పాల్గొన్నారు.

## ఘనంగా పసుపు కుంకుమ పంపిణీ



**విశాలభారతి, అడవిదేవులపల్లి:** నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని వేచి ఉన్నటువంటి శ్రీ గోపయ్య లక్ష్మీ తిరుపతమ్మ తల్లి కళ్యాణం అనంతరం శ్రీరామ్ గోపాల్ రావు గుప్తా, పొట్టిమూర్తి బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో అడవిదేవులపల్లి భక్త జనానికి అంగరంగ వైభవంగా పసుపు కుంకుమ పంపిణీ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చిన్నబోయిన గురవయ్య, చిన్నబోయిన శ్రీకాంత్, భక్తజనం తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలనలో అందరూ సమానమే

- సర్పంచ్ మర్రి సంధ్య



**అశ్వాపురం, విశాలభారతి:** మండలంలోని మొండికుంట గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ బోర్డును సోమవారం సర్పంచ్ మర్రి సంధ్య తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపార సముదాయాలను ఆక్రమించకుండా పాలకవర్గ సహకారంతో వ్యాపారస్తులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారందరి అనుమతితో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ హద్దులు నియమించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపైకి రావద్దన్నారు. పాలకవర్గం వ్యాపారస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. ఫిబ్రవరి ఒకటో తారీకు వరకు వ్యాపారస్తులు స్వచ్ఛందంగా నిర్ణయించిన హద్దుల మేరకు వ్యాపారాలను నిర్వహించుకోవాలని గతంలోనే తెలియజేశారన్నారు. తనకు మద్దతుతో పాటు శుభాకాంక్షలు తెలియజేసిన ఫ్లెక్సీలను కూడా స్వచ్ఛందంగా తొలగించాలని ఆమె కోరారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేసిన ఎమ్మెల్యే పాయం



**అశ్వాపురం, విశాలభారతి :** మండలంలోని చింతిర్యాలగూడెం గ్రామానికి చెందిన లంకా సాయిరాం అనే లబ్ధిదారుడికి సోమవారం పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు రూ. 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మణుగూరు లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందించడంలో సీఎం రేవంత్ రెడ్డి ఎంతో చొరవ చూపిస్తున్నాడన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా అందజేసిన ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెల్లం వీరభద్రం నాయకులు పాల్గొన్నారు.

## తహసిల్దార్ గా బాధ్యతలు చేపట్టిన ట్రైని కలెక్టర్

**అశ్వాపురం, విశాలభారతి:** అశ్వాపురం తహసిల్దార్ గా సోమవారం ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ ఉత్తర్వుల మేరకు ఈనెల 28వ తేదీ వరకు ట్రైనీలో భాగంగా తహసిల్దార్ విధులు చేపట్టనున్నారు. కార్యాలయానికి విధులకు హాజరయ్యేందుకు వచ్చిన ఆయనకు తొలుత తహసిల్దార్ మనిధర్, డిటి రాజేశ్వరరావు తోపాటు రెవెన్యూ ఉద్యోగులందరూ ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సాధారణంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు.



## సేవే లక్ష్యంగా గురిజాల గోపి



- నిరుపేద ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం

**మణుగూరు, విశాలభారతి:** మండలంలోని నిరుపేద ప్రజలకు ఉచిత వైద్యం లక్ష్యంతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి మానవత సేవా దృక్పథంతో ప్రతి ఒక్కరికి ఉచిత నాణ్యమైన వైద్యం అందించే దిశగా అడుగులు వేస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశీస్సులతో మరియు మాజీ కేంద్రమంత్రి రాజ్యసభ సభ్యురాలు గారపాటి రేణుకా చౌదరి ఆదరణతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో మణుగూరులో ప్రసిద్ధి చెందిన ప్రగతి హాస్పిటల్ ఎండీ మొహిద్దీన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సోమవారం నాడు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గురజాల గోపి ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. అనంతరం మణుగూరు మండలం లోని ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినిగించుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి త్వరలో ప్రత్యేక సదుపాయాలు కల్పించడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్ పసుపులేటి వీరబాబు ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి తాను ఎల్లవేళలా సహాయంగా తన వంతు కృషిని అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు,పట్టణంలోని ప్రజా ప్రతినిధులు మరియు ఉచిత మెగా వైద్య శిబిరానికి సేవలందించడానికి రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ మరియు మహిళా సభ్యులు సీనియర్ నాయకురాలు ఎండీ షబానా తదితరులు పాల్గొన్నారు.

## జన సంచారం నడుమ గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు

- ఊరి బైట గోడం.. ఊరు మధ్యన విక్రయాలు
- గ్యాస్ డీలర్ ఇష్టారాజ్యం
- కొరవడిన సివిల్ సప్లై అధికారుల పర్యవేక్షణ
- భయం భయంతో గడుపుతున్న ఆ ప్రాంత ప్రజలు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి:** జనసంచారం లేని ప్రదేశంలో ఊరికి దూరంగా గోడంలో ఉండాల్సిన గ్యాస్ సిలిండర్లు జనావాసాల మధ్య పెట్టి చాకచక్యంగా అమ్మకాలు జరుపుకుంటున్నాడు ఓ గ్యాస్ కంపెనీకి చెందిన డీలర్. పర్యవేక్షణ చేపట్టాల్సిన సివిల్ సప్లై అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడంతో ఆ ప్రాంతంలో నివసిస్తున్న జనంతో పాటు వ్యాపారులు క్షణ క్షణం భయాందోళనకు గురవుతున్నారు. నగరం నడిబొడ్డున గ్యాస్ సిలిండర్లనుంచి ప్రజల ఇబ్బందులను గమనంలోకి తీసుకోకుండా సదరు డీలరు ఆడిందే ఆట పాడిందే పాటగా అతని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడని పలువురు అంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం గ్రామపంచాయతీ లోని మంచి కంటి నగర్ గ్రామ సమీపంలో గ్యాస్ గోడం ఉంది. గ్యాస్ గోడౌన్ పెట్టిన కొన్నేళ్లదగ్గర నుండి ఇక్కడే కార్యాలయ కార్యనిర్వహణతోపాటు సిలిండర్లు కూడా నిల్వ పెట్టుకునేవారు. అక్కడినుండి ఆటోల ద్వారా గ్రామాలలో సిలిండర్ అవసరమైన వారికి డోర్ డెలివరీ ఇచ్చేవారు. అయితే ఇప్పుడు గత కొంతకాలం క్రితం నుండి సదరు డీలరు మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని ఆఫీస్ కార్యకలాపాలతో పాటు గోడౌన్ నుండి కొన్ని సిలిండర్లను తీసుకుని వచ్చి షాప్ ముందు పెట్టి బహిరంగంగానే విక్రయిస్తున్నాడు. ఇలా అమ్మకాలు చేపట్టడం వలన ప్రమాదవశాస్తూ సిలిండర్లు పేలితే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఇక్కడివారు ఆందోళన చెందుతున్నారు. అంత ధైర్యంగా జనసంచారం మధ్యలో సిలిండర్లు పెట్టి విక్రయాలు చేపట్టడం వెనుక డీలర్కు సంబంధిత శాఖ ఆశీస్సులు మెండుగా ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రానికి నడిబొడ్డున ఓ గ్యాస్ కంపెనీకి చెందిన డీలరు షాప్ ముందు నిరభ్యంతరంగా సిలిండర్లను పెట్టి అమ్మకాలు చేపడుతున్నా సివిల్ సప్లై అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రమాదమని తెలిసి కూడా గ్యాస్ సిలిండర్ల విక్రయాలు చేపడుతుంటే చర్యలు తీసుకోవలసిన ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తన్నట్లు వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగేవరకు పట్టించుకోరా అంటూ అధికారుల తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జనావాసాల మధ్య గ్యాస్ సిలిండర్లు అమ్మకాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## కర్మాన్‌ఘాట్‌లో బాధితులకు అండగా ఈటల

**రంగారెడ్డి, విశాలభారతి:** జిల్లా కర్మాన్‌ఘాట్‌లో దేవాలయ భూముల పేరుతో ఇళ్లను ఖాళీ చేయించడాన్ని నిరసిస్తూ బాధితులు చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం బాధితులను పరామర్శించగా, దశాబ్దాలుగా నివాసం ఉంటున్న తమ ఇళ్లను ఇప్పుడు స్వాధీనం చేసుకోవడమేంటని వారు కన్నీరుమున్నీరయ్యారు. 35 ఏళ్ల క్రితం కష్టపడి కొనుక్కున్న స్థలాల్లో ఇళ్లు కట్టుకుంటే, ఇప్పుడు రోడ్డున పడేశారని మహిళలు ఈటల కాళ్లపై పడి ఆవేదన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వేళ చిన్నపిల్లలు, మహిళలు అని చూడకుండా ఇరవై కుటుంబాలను బయటకు ఈడ్చివేయడం అధికారుల మూర్ఖత్వానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. 1992లో లేఅవుట్ చేసి పేదలకు స్థలాలు విక్రయించినప్పుడు అప్పటి కలెక్టర్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు. ముప్పై ఏళ్ల క్రితమే అనుమతులు ఇచ్చి, రిజిస్ట్రేషన్లు చేసి, నల్లా, కరెంటు కనెక్షన్లు కల్పించిన అధికారులు.. ఇప్పుడు అవి దేవాలయ భూములంటూ కూల్చివేతలకు రావడం దుర్మార్గమన్నారు. ఆనాడు తప్పు చేసిన అధికారు



లను, లేఅవుట్ చేసిన వారిని వదిలేసి, అమాయక ప్రజలపై యుద్ధం ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అక్రమ కబ్జాలను తాము వ్యతిరేకిస్తామని, అయితే ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలను వేధించడం సరికాదని ఈటల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి, బాధితులకు తక్షణ ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. చిన్నపిల్లల దుఃఖానికి కారణమవుతూ వారిని ఇళ్ల నుంచి గెంటివేయడం ప్రభుత్వానికి మంచిది కాదని హెచ్చరించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## మూడు జాతీయ సెమినార్లకు బ్రోచర్ విడుదల

- జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచలో నిర్వహించనున్న మూడు జాతీయ స్థాయి సెమినార్లకు సంబంధించిన బ్రోచర్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతులమీదుగా అధికారికంగా ఆవిష్కరించి, ఈ సెమినార్ కార్యక్రమాలకు హాజరుకావాలని కళాశాల బృందం ఆహ్వానం పలికింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ స్థాయి సెమినార్లు విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులకు జ్ఞాన మార్పిడి, పరిశోధనా దృక్పథం విస్తరణకు దోహదపడతాయని పేర్కొంటూ, కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కళాశాల ప్రతినిధులు కేటీపీఎస్ 56 స్టేజ్ చీఫ్ ఇంజనీర్ ఎం. ప్రభాకర్ రావు ని కూడా కలసి, కళాశాలలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సెమినార్లకు హాజరుకావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన కూడా ఈ అకాడమిక్ కార్యక్రమాల నిర్వహణను అభినందిస్తూ, విద్యార్థులకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పోలారపు పద్మ , పారెల్లి శ్రీనివాస్, పొట్లపు శ్రీనివాసరావు అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ డి రమేష్ పాల్గొన్నారు.

## మండల స్థాయి సీఎం కప్ క్రీడ పోటీలు

- క్రీడలను ప్రారంభించిన ఎమ్మార్వో కాంతయ్య



**విశాలభారతి, కరకగూడెం:** మండలంలోని తాటిగూడెం క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో కాంతయ్య గారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రతిభను వెలికిదీయడమే సీఎం కప్ నిర్వహిస్తున్నామని అన్నారు. అనంతరం మండల స్థాయి జరిగిన సీనియర్ విభాగం వాలీబాల్ సమత్ మోతె క్లస్టర్ మొదటి బహుమతి,జూనియర్ విభాగం వాలీబాల్ బహుమతి చిరుమల్ల క్లస్టర్,కబడ్డీ విభాగంలో చిరుమల్ల క్లస్టర్ గెలుచుకున్నారు.కోకో విభాగంలో కరకగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గెలుపొందారు.గెలిచిన విజేతలకు బహుమతులు వారు అందజేశారు. క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అసెంబ్లీకి పంపించడం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నోబెల్ ఆఫీసర్ గడ్డం మంజుల వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు,సెక్రటరీలు ,క్లస్టర్లు,సీనియర్ క్రీడాకారులు,క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## రేగాకి రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్



**విశాలభారతి, కరకగూడెం:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన అభిమాన నాయకులు అభివృద్ధి పదాత పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు గౌ.శ్రీ.. పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించి నిన్న మణుగూరులో జరిగిన నిరసన కార్యక్రమం పేరుతో మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మతిభ్రమించినట్లుగా వ్యవహరిస్తూ చేతిలో కర్ర పట్టుకొని పోలీసులను సైతం లెక్కచేయకుండా రౌడీ రాజకీయానికి తెరలేపడం తీవ్రంగా ఖండిస్తున్నామని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీ తరఫున రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఆనాడు పార్టీకి ద్రోహం చేసి అధికార బిఆర్ఎస్ పార్టీలో చేరిన పార్టీ మారిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రాజకీయ జీవితాన్ని మరిచి నేడు కాంగ్రెస్ నాయకులను కార్యకర్తలను మీడియా ముందు బూతులు తిట్టడం గర్హించదగ్గ చర్య అని అన్నారు. అధికారం పోయింది అని అసహనంతో జీర్ణించుకోలేక నోటికొచ్చినట్లు మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పోలేబోయిన సుజాత , మాజీ సర్పంచ్ నియోజకవర్గ నాయకులు తోలేం నాగేశ్వరరావు , ఉపసర్పంచులు పూజారి వెంకన్న , ఈసం కోటేశ్వరరావు మండల నాయకులు ఎర్ర సురేష్ , జలగం కృష్ణ గొగ్గలి రవి షేక్ రఫీ పడిగ సమ్మయ్య, మండల నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

## అక్రమ ఆక్రమణలు తొలగించాలి

- తహసిల్దార్‌కు సర్పంచ్ వినతి



**జహీరాబాద్, విశాలభారతి:** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలోని పిచేర్యాగడి పాత తాండ గ్రామ శివారులో ఉన్న సర్వే నంబర్-100 నరసింహారెడ్డి చెరువులో జరిగిన అక్రమ ఆక్రమణలను వెంటనే తొలగించి, చెరువును అసలు విస్తీర్ణంలో పునరుద్ధరించాలని తాండ సర్పంచ్ రామావత్ భీమి బాయి ,సోమవారం తహసిల్దార్ సుప్రియ కు వినత పత్రం అందజేశారు. గ్రామంలోని నరసింహారెడ్డి చెరువు గతంలో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని ప్రస్తుతం అక్రమ ఆక్రమణల కారణంగా దాని విస్తీర్ణం సుమారు 7 ఎకరాలకు మాత్రమే పరిమితమైందని తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమగ్ర విచారణ జరిపించి,చెరువుపై జరిగిన అక్రమ ఆక్రమణలను పూర్తిగా తొలగించి,నరసింహారెడ్డి చెరువును అసలు విస్తీర్ణంలో పునరుద్ధరించేందుకు తగిన చర్యలు విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో కోహిర్ మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాథోడ్ వినోద్ కుమార్ ఉన్నారు.




## బ్రేకప్ వెనుక కారణాలు వెల్లడించిన

# మృణాల్ ఠాకూర్

స్టార్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తాజాగా నటించిన బాలీవుడ్ చిత్రం 'దో దీవానే శహర్ మే' మరో రెండు వారాల్లో ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముఖ్యంగా తన మాజీ ప్రేమ వ్యవహారం గురించి మృణాల్ చేసిన వ్యాఖ్యలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇంటర్వ్యూలో మాట్లాడిన మృణాల్ తన గత రిలేషన్‌షిప్ గురించి ఓపెన్‌గా స్పందించారు. "నేను సినిమాల్లోకి రావడం అతనికి అస్సలు నచ్చలేదు. నేను చాలా దూకుడుగా ఉంటానని, నాతో లైఫ్ కొనసాగించలేనని చెప్పి బ్రేకప్ చెప్పాడు. అయితే అతను బ్రేకప్ చెప్పినందుకు నేను బాధపడలేదు. కానీ అతని ఆలోచనా విధానంపై మాత్రం జాలి వేసింది. అలాంటి మనస్తత్వం ఉన్న వ్యక్తితో బంధం కొనసాగించడం కష్టమే" అని పేర్కొన్నారు. అంతేకాకుండా ఇలాంటి మైండ్‌సెట్ ఉన్న వాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే విధమైన ఆలోచనలతో పెరుగుతారు. అది నాకు అస్సలు ఇష్టం లేదు. అందుకే విడిపోవడం మంచిదని భావించాను అంటూ తన నిర్ణయానికి కారణాలు వివరించారు. ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో చర్చకు దారి తీశాయి. ఇక గత కొద్ది నెలలుగా మృణాల్ ప్రేమ, పెళ్లి వార్తలతో తరచూ హెడ్లైన్స్‌లో నిలుస్తున్నారు. ముఖ్యంగా తమిళ్ స్టార్ హీరో ధనుష్‌తో డేటింగ్‌లో ఉన్నారనే వార్తలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. ఈ ఇద్దరూ త్వరలోనే వివాహం చేసుకోబోతున్నారన్న ప్రచారం కూడా సాగింది. అయితే ఈ వార్తలను మృణాల్ టీమ్ స్పష్టంగా ఖండించింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడే గానీ, అంతకంటే ఏమీ లేదని మృణాల్ తేల్చి చెప్పారు. ఇదే విధంగా టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌తోనూ డేటింగ్ రూమర్స్ వినిపించాయి. ఈ ప్రచారాన్ని కూడా ఆమె సరదాగా తీసుకున్నారు. "ఇలాంటి రూమర్స్ వినడానికి ఫన్నీగా ఉంటాయి. కొంతమంది వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నవ్వుకుంటాను. ఇవన్నీ నాకు ఫ్రీ పీఆర్‌లాంటివే" అని చమత్కరించారు.ఇదిలా ఉండగా, మృణాల్ ప్రధాన పాత్రలో నటించిన 'దో దీవానే శహర్ మే' చిత్రం ఈ నెల 20న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాకు రవి ఉద్యవర్ దర్శకత్వం వహించగా, సిద్ధాంత్ చతుర్వేది కీలక పాత్రలో నటించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి. రొమాంటిక్ డ్రామా నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రంపై బాలీవుడ్ వర్గాల్లోనూ మంచి అంచనాలే నెలకొన్నాయి.

## ఘనంగా పద్మశ్రీ డా.బ్రహ్మానందం

# 70వ పుట్టినరోజు వేడుకలు!



**హైదరాబాద్**

పద్మశ్రీ డా.బ్రహ్మానందం 70వ పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా హైదరాబాద్ లో జరిగాయి. పేరమ్ గ్రూప్ మరియు శ్రీని ఇన్ఫ్రా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు డిప్యూటీ స్పీకర్ రఘురామమ కృష్ణంరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే నటులు బాబు మోహన్, ఎల్.బి.శ్రీరామ్, ఉత్తేజ్, పృథ్వి, బిత్తిరి సత్తి, ముక్కు అవినాష్, రఘు కుంచె, ఆర్పీ.పట్నాయక్, రఘుబాబు, రచ్చ రవి, ప్రగతి, ప్రభాస్ శ్రీను, సంపూర్ణేష్ బాబు తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ... "42 ఏళ్ల సుదీర్ఘ నట ప్రయాణంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంన్నానని అన్నారు, తాను నటుడిగా కొనసాగుతున్నాను అంటే అది తన గొప్పదనం కాదని ప్రేక్షకులదేనని అన్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు శాలువా తో ఆయన్న సన్మానించారు. ఎల్బీ శ్రీరామ్, బాబు మోహన్, ఉత్తేజ్, రఘుబాబు, సంపూర్ణేశ్ బాబు తదితరులు పాల్గొని ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు .

ఉపాధ్యాయుడిగా తన జీవితాన్ని ప్రారంభించిన బ్రహ్మానందం అనూహ్యంగా సినీ రంగంలోకి అడుగుపెట్టారు. సహజమైన హావభావాలు, హాస్య ప్రధానమైన బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ ఆయన్ని ఇతర కమెడియన్ల కంటే ప్రత్యేకంగా నిలబెట్టింది. తెలుగులో మాత్రమే కాకుండా ఇతర భాషల్లోనూ కలిపి 1250కి పైగా సినిమాల్లో నటించి, 2010లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారాయన. సినీ ఇండస్ట్రీకి ఆయన చేసిన సేవల్ని




గుర్తించిన భారత ప్రభుత్వం 2009లో పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. వయస్సు పెరిగినా ఆయన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ఈ వేడుకలో స్పష్టంగా కనిపించింది. 'తెలుగు సినిమా' పేరు చెబితే ప్రపంచవ్యాప్తంగా ముందుగా గుర్తొచ్చే మొహం బ్రహ్మానందమే అన్న మాట మరోసారి నిజమైంది. తెరపై ఆయన కనిపిస్తే చాలు, ఒక్క డైలాగ్ లేకపోయినా థియేటర్లు నవ్వులతో మార్మోగుతాయి. నేటి సోషల్ మీడియా యుగంలోనూ మీమ్స్‌కు ఆయనే ప్రాణం కావడం బ్రహ్మీకి ఉన్న క్రేజ్‌కి నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ పుట్టినరోజు వేడుకల్లో ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ప్రత్యేకంగా పాల్గొని శాలువాతో బ్రహ్మానందాన్ని సన్మానించారు. "బ్రహ్మానందంలో నేను కమెడియన్‌ను చూడలేదు... గొప్ప నటుడిని మాత్రమే చూశా. ఆయన్ని నిత్యం తలచుకోని తెలుగు వాడు ఉండడు" అంటూ ఆయన ప్రశంసల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీ శ్రీరామ్, బాబు మోహన్, ఉత్తేజ్, రఘుబాబు, పృథ్వీరాజ్, రచ్చ రవి, సంపూర్ణేశ్ బాబు, ప్రగతి తదితర సినీ ప్రముఖులు పాల్గొని, బ్రహ్మానందంతో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Madarapu Ashok. RNI No APTEL/2010/32877.